
వార్త
ఆదివారం
9 ఏప్రిల్, 2023
చిరుధాన్యాలే
ఆరోగ్య సిరులు



టాలీవుడ్ కథానాయికలలో శ్రీలీల బిజీగా ఉంది. 'ధమాకా' సినిమాతో పెద్ద హిట్ అందుకున్న ఈ బ్యూటీ త్వరలో నితిన్, రామ్, వైష్ణవ్‌తేజ్ జోడీగా అలరించనుంది. ఇక అనిల్ రావిపూడి సినిమాలో బాలకృష్ణ కూతురుగా కనిపించనుంది. బాలకృష్ణ తరువాత ఆమె పాత్రకే ప్రాధాన్యం ఉంటుందని తెలుస్తోంది. ఇప్పుడు తాజాగా పవన్ కళ్యాణ్ జోడీగా ఛాన్స్ కొట్టేసింది శ్రీలీల. పవన్ కళ్యాణ్ హీరోగా హరీశ్‌శంకర్ 'ఉస్తాద్ భగత్ సింగ్' సినిమాను రూపొందిస్తున్నాడు. ఈ సినిమాలో పవన్ సరసన నాయికగా ఆమెను తీసుకున్నారు. ఈమె ఈ మధ్యనే ఇండస్ట్రీకి వచ్చినప్పటికీ సీనియర్ హీరోల జోడీగా కుదిరిపోయే ఫిజిక్

# 'ఉస్తాద్ భగత్‌సింగ్'లో శ్రీలీల

ఆమె సొంతం. దానికి తోడు క్రేజ్‌కి తగిన సక్సెస్‌లు దక్కడం మరో విశేషం. ఈ చిత్రంలో మరో కథానాయికగా మాళవిక మోహనన్ కనిపించనుంది. మైత్రీబ్యానర్‌పై తీస్తున్న సినిమాకు దేవీశ్రీ ప్రసాద్ సంగీతం సమకూరుస్తున్నాడు.

## తారాతీరం

# 'గేమ్ చేంజర్'గా రామ్‌చరణ్!

క్రేజీ డైరెక్టర్ శంకర్, మెగా పవర్ స్టార్ రామ్‌చరణ్ తేజ్ కాంబినేషన్‌లో రాబోతున్న పాన్ ఇండియా సినిమాకి 'గేమ్ చేంజర్' అనే టైటిల్ ఫిక్స్ చేసినట్లు తెలుస్తోంది. అన్ని భాషలకు ఈ టైటిల్ సరిపోతుందని, ఈ టైటిల్ పెట్టినట్లు తెలుస్తోంది. 'ఆర్ఆర్ఆర్' సినిమాలోని 'నాటు నాటు' పాటకి ఆస్కార్ వచ్చిన తర్వాత రామ్‌చరణ్‌తేజ్ ఇమేజ్ గ్లోబల్ రేంజ్‌కి వెళ్లింది. అందువల్ల శంకర్ చరణ్ సినిమాని ఆ రేంజ్‌లో ప్లాన్ చేస్తున్నాడు. ఈ చిత్రంలో రామ్‌చరణ్ తన కెరీర్‌లోనే బెస్ట్ లుక్‌లో కనిపించబోతున్నాడు. వెరీ స్టైలిష్ లుక్‌లో విభిన్నశైలితో చరణ్, ఈ సినిమాలోనే ప్రధాన హైలెట్‌గా నిలుస్తాడట. ఇందులో చరణ్ ద్విపాత్రాభినయం చేస్తున్నాడు. వీటిలో ఒక పాత్రలో గ్రామీణ యువకుడిగా, మరో పాత్రలో సూపర్ స్టైలిష్‌గా కనిపిస్తాడట. భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న ఈ భారీ సినిమాలో బరువైన ఎమోషన్స్‌తో పాటు గ్రాండ్ విజువల్స్ కూడా వుండనున్నట్లు తెలుస్తోంది.



ఆదివారం వార్త
sunmagvaartha@gmail.com
9 ఏప్రిల్, 2023

## మంచి ముత్యాలు

నీతికొరకు ఆకలిదప్పులు గలవారు ధన్యులు,
వారు తృప్తిపరచబడుదురు.

- జీసస్ క్రైస్ట్

## విషయ విశేషం

లెగోల బొకేలు... 4
'సంఘీ'భావం....5
ఓటింగ్‌లో అధునాతన విధానాలు
కవర్ స్టోరీ..6
చిరుధాన్యాలే
ఆరోగ్య సిరులు
మహిమాన్వితమైన అష్టాదశ శక్తిపీఠాలు ..9
ఈవారం కవిత్వం..12
మీకెందుకూ!
వేసవి తాపాన్ని తీర్చే 'కర్బూజా' ......18
కథ.. 20
జీవన ప్రస్థానం
సాహిత్యం...23
పాటే ఆయుధంగా 'సుద్దాల హన్మంతు'
ఆస్ట్రేలియా ప్రకృతి సోయగాలు ...25
రొయ్యలపాలెం-గవ్వలపాలెం....30
ఇంకా..
పుస్తక సమీక్ష
మొగ్గ
వారఫలం
నవ్వుల్..రువ్వుల్..
వగైరా..వగైరా..

# తాజా వార్తలు

## విమానమే ఇల్లుగా



అందరిలా ఇంట్లో ఉంటే విశేషం ఏముంటుందని విమానాన్నే నివాసంగా మార్చేసుకున్నాడు ఓ బ్రిటిష్ పెద్దాయన. వెతికి వెతికి కాలం చెల్లిన ఓ బోయింగ్ విమానాన్ని అతి చౌక ధరకు అంటే కేవలం 82 వేల పౌండ్లకు (రూ.81.82 లక్షలు) కొనుగోలు చేసి, దానినే తన నివాసంగా మార్చుకుని ఇటీవల వార్తలకెక్కాడు. అతని పేరు బ్రూస్ కాంప్‌బెల్(73 సం॥), ఎలక్ట్రికల్ ఇంజినీరుగా పని చేసేవాడు. "విమానాలంటే నాకు చిన్నప్పటి నుంచి తగని పిచ్చి. కాలం చెల్లిన విమానాలు ప్లేన్ బోన్‌యార్డుల్లో(విమానాల షెడ్లు) పడి వుండటం అడపా దడపా వార్తల్లో చూసేవాడిని. అలాంటి వాటిలో ఒక విమానాన్ని సొంతం చేసుకోవాలని అనుకునేవాణ్ణి. ఇన్నాళ్లకు ఒక విమానాన్ని సొంతం చేసుకున్నాను. ఇప్పుడు దీనినే నా ఇల్లుగా మార్చుకున్నాను. నివాసం ఉండటానికి ఇది నాకెంతో బాగుంది" అని కాంప్‌బెల్ అంటున్నాడు. అమెరికా మాజీ అధ్యక్షుడు జె.ఎఫ్.కెన్నెడీ భార్య జాకీ కెన్నెడీని పెళ్లాడిన అరిస్టాటిల్ ఒనాసిస్ ఒకప్పుడు ఉపయోగించిన 'బోయింగ్ 727' విమానం 1999 నుండి గ్రీస్‌లో పడివున్నట్లు తెలుసుకుని, దీనిని కొనుగోలు చేసాట్ట. విమానం ధర 82 వేల పౌండ్లు అయినా, గ్రీస్ నుంచి తాను నివాసం ఉంటున్న ఒరెగాన్‌కు తరలించడానికి 99 వేల పౌండ్లు (98.83 లక్షలు) ఖర్చు కావడం విశేషం.

### సువాసనల హ్యాంగర్

బట్టలు వేలాడదీయడానికి కలప హ్యాంగర్లు, లోహపు హ్యాంగర్లు చాలా కాలంగా వాడుకలో ఉన్నాయి. వార్డ్ రోబ్‌లలో దుస్తులు దాచుకోవడానికి చాలామంది హ్యాంగర్లు వాడుతుంటారు. సాదాసీదా హ్యాంగర్లకు అంతకుమించిన ఉపయోగం లేదు. అయితే, అమెరికాకు చెందిన చైనీస్ సంతతి డిజైనర్ సువా షోయి ఇటీవల 'ప్లాడ్' పేరుతో పరిమళాలను వెదజల్లే హ్యాంగర్‌కు రూపకల్పన చేసింది. ఈ హ్యాంగర్‌ను విడిభాగాలుగా విడదీసుకోవడం, తిరిగి జోడించడం చాలా తేలిక. ఈ హ్యాంగర్‌లో గొట్టంలా ఉండే భాగంలో నచ్చిన పరిమళాలతో కూడిన సెంట్ పాడ్స్‌ను నింపుకొని, తిరిగి బిగించేసి, దుస్తులు తగిలించుకుంటే చాలు. ఈ హ్యాంగర్ అన్ని వైపులా సమానంగా తిరుగుతూ దుస్తులను పరిమళభరితం చేస్తుంది.









# లెగోల బొకేలు

ఇచ్చి పుచ్చుకునే కానుకల్లో మొట్టమొదటి స్థానాన్ని ఆక్రమిస్తాయి పూలు. వాటికి కాస్త సృజనాత్మక జోడించి ఇస్తే మరింత అందాన్ని సంతరించుకుంటాయి. అందులో లెగో ఫ్లవర్ బొకేలు మరింత ప్రత్యేకమని చెప్పవచ్చు. లెగో బొకేల్లో నిజమైన పూల స్ఫూర్తితో చేసిన అనేక రకాల కృత్రిమ పూలుంటాయి. మందారం, డైసీలు, గులాబీలు, ఏస్టర్, స్నాప్‌డ్రాగన్, పాపీల్లాంటి బోలెడు పూలను లెగోల్లో తయారు చేసుకోవచ్చు. ఇందులో గడ్డిపోచలతో పాటు వివిధ ఆకృతుల్లోని ఆకులూ ఉంటాయిందులో. వీటితో పాటు లభించే బుక్‌లెట్ ఆధారంగా అందమైన పువ్వుల్ని సృజనాత్మకను జోడించి మనమే తయారు చేసుకోవచ్చు. ఆర్కిడ్‌లు, సకురాల లాంటి పూలమొక్కల్నీ లెగో కిట్లలో తయారు చేయవచ్చు. నిజమైన పూలగుత్తుల్ని చూడగానే ఆనందాన్నిస్తే ఇవి మనల్ని పనిలో నిమగ్నం చేసి కొత్త అందాన్ని సృష్టించిన అనుభూతిని కలిగిస్తాయి. వివిధ రంగుల్లో, విభిన్న ఆకృతుల్లో గదికి కొత్త ఆకర్షణను తీసుకొస్తాయి. ఎప్పటికీ వాడిపోని ఈ పూలను బహుమతులుగా ఇవ్వడానికెంతో బాగుంటాయి.



## 'సంఘీ' భావం



# ఓటింగ్‌లో అధునాతన విధానాలు

ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్యదేశమైన భారతదేశంలో ఎన్నికలు అత్యంత ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించడమే కాకుండా ఓటర్లు నిర్భయంగా ఓటింగ్‌లో పాల్గొనేందుకు అన్ని చర్యలు తీసుకుంటాయి. దాదాపుగా అన్ని శాఖల అధికారులు ప్రత్యేక విధుల్లోకి వెళ్లడం ద్వారా ఆనాడు ఉండే ప్రభుత్వ వత్తిడిలు పనిచేయకుండా ఎన్నికల కమిషన్ రంగంలోకి దిగుతుంది. ఓటింగ్ సమయంలో గతంలో బ్యాలెట్ పత్రాలను ఉపయోగించేవారు. ఈ సమయంలో ముద్రణకు భారీ వ్యయం అయ్యేంది. ఓటింగ్ అనంతరం వీటిని భద్రపరచడానికి బ్యాలెట్ బాక్సులను ఉపయోగించేవారు. అనంతరం ఓట్ల లెక్కింపులో తీవ్రజాప్యం జరిగేది. అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు 24 గంటల లోపే ప్రకటిస్తే పార్లమెంటు ఎన్నికల ఫలితాలు వెల్లడి అయ్యేందుకు 30 గంటల సమయం దాటేది. అప్పటి వరకు ప్రభుత్వ సిబ్బంది, అధికారులు రోజువారీ కార్యక్రమాలను పక్కన పెట్టి ప్రత్యేక విధుల్లో కొనసాగేవారు. లెక్కింపు పూర్తి అయిన తరువాత బ్యాలెట్ బాక్కులను భద్రపరచడం కూడా వ్యయ ప్రయాసాలతో కూడకుని ఉండేది. అనంతరం ఈ స్థానంలో భారత ఎలక్ట్రానిక్ సంస్థ రూపకల్పన చేసి ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు (ఇవిఎం) వచ్చిన తరువాత చాలా సమయం ఆదా అవుతోంది. పోలింగ్ సమయంలో కూడా చిన్నపాటి సమస్యలు మినహా ఇప్పటి వరకు ఇవి విజయవంతంగా పనిచేస్తున్నాయి. ఓట్ల లెక్కింపు సమయంలో మరింతగా వెసులుబాటు ఉంటోంది. కొన్ని అసెంబ్లీ స్థానాల ఫలితాలు లెక్కింపు ప్రారంభమైన కొన్ని గంటల్లోనే పూర్తి అయి ఫలితాలు వెలువడుతున్నాయి. దాదాగా సాయంత్రం సమయానికి ఓట్ల లెక్కింపు ప్రక్రియ పూర్తి అవుతోంది. అయితే ఎన్నికల్లో పరాజయం పొందిన పార్టీలు, వ్యక్తులు  కొందరు మాత్రం ఇవిఎంల పనితీరుపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నాయి. ప్రస్తుతం వీటి స్థానంలో రిమోట్ ఓటింగ్ యంత్రాలు (ఆర్‌విఎం) ప్రవేశపెట్టడానికి ఎన్నికల సంఘం ప్రయత్నాలు చేస్తోంది. దీనివల్ల ఓటర్లు స్వంత నియోజకవర్గంలో లేకపోయినా వేరే ప్రాంతాల నుంచి ఓట్లు వేసే అవకాశం ఉంటుంది. ఈ విధంగా ఇతర ప్రాంతాలకు ఓట్లు వేసే వారు ఒకరోజు ముందుగా తాము ఏ నియోజకవర్గానికి ఓట్లు వేయబోతున్నామన్న విషయాన్ని అధికారులకు తెలియజేయాల్సి ఉంటుంది. చాలా మంది ఓటర్లు ఉపాధి కోసం నగరాలకు, ఇతర రాష్ట్రాలకు వలస వెళుతుంటారు. అయితే ఎన్నికల సమయంలో వారు తిరిగి తమ గ్రామానికి వెళ్లి ఓటు వేసే అవకాశం ఉండదు. ఉపాధి ప్రాంతం నుంచి తమ గ్రామం దూరంగా ఉండటం, ప్రయాణ ఖర్చులు వంటివి వాటి వల్ల వారు ఓటింగ్‌కు దూరంగా ఉండాల్సి వస్తోంది. కొన్ని సందర్భాల్లో వీరు తమ గ్రామాలకు వెళ్లడానికి సిద్ధంగా ఉన్నా సెలవులు లేకపోవడం, నాలుగు రోజుల పాటు గ్రామానికి వెళితే ఆ సమయంలో జీతం, రోజువారీ కూలీ రాకపోవడంతో ఓటు వేయాలన్న ఆసక్తి ఉన్నప్పటికీ ఓటింగ్‌లలో పాల్గొనడం లేదు. తాము పనిచేస్తున్న ప్రాంతానికి ఓటరు కార్డు మార్చుకోవడానికి వలస కార్మికులు అంగీకరించరు. ఎందుకంటే వీరు పలు నగరాలు తిరుగుతూ ఉపాధి పొందుతారు. అదేవిధంగా తాము ఎప్పటికైనా తమ గ్రామానికి తిరిగి చేరుకుంటామని, అందుకు కొత్త ప్రాంతాల్లో స్థిర నివాసం ఏర్పాటుచేసుకోవడంపై దృష్టి సారించడం లేదు. ఈ కారణాల వల్ల ప్రతిసారి ఎన్నికల సమయంలో గరిష్టంగా 80 శాతం ఓటింగ్ మాత్రమే నమోదు అవుతోంది. గ్రామాల్లో వీరు లేరని తెలుసుకున్న రాజకీయ వర్గాలు కొందరు వీరి పేరుపై ఉన్న ఓట్లను చట్టవ్యతిరేకంగా ఉపయోగించుకుంటున్నారు. ఇలాంటి సమస్యలను అధిగమించి దేశంలో ఎక్కడ ఉన్నా ఓటు ఉపయోగించుకునే విధానాన్ని అమలుచేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ మేరకు ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా రియోట్ ఓటింగ్ యంత్రాలను రూపకల్పన చేసింది. ఎన్నికల్లో వలస కార్మికుల వల్ల కోల్పోతున్న సుమారు 30 కోట్ల ఓట్లను సాధించడమే ఈ ఆర్‌విఎం లక్ష్యం. ఒక ఓటు హక్కు ఉన్న స్థలంలో కాకుండా దూర ప్రాంతాల్లో ఉన్న ఓటర్లు ఎన్నికల నోటిఫికేషన్ విడుదల అయిన తరువాత తాము ఏ నియోజకవర్గంలో ఓటు వేస్తున్నారో ఆ విషయాన్ని తాము నివాసం ఉన్న ప్రాంతంలోని ఎన్నికల అధికారులకు సమాచారం ఇవ్వాలి. దీనితో వారు ఓటు రిజిష్టర్ చేస్తారు. ఎన్నికల పోలింగ్ సమయంలో సదరు ఓటరు పోలింగ్ కేంద్రానికి చేరుకున్న తరువాత ఆ నియోజకవర్గం కోడ్ నెంబరును నమోదు చేసి ఆర్‌విఎంపై బ్యాలట్ పేపర్ కనిపించేలా చేస్తారు. ఓటరు ఓటింగ్‌లో పాల్గొన్న తరువాత ఆ ఓటు అతను వేసిన నియోజకవర్గానికి చేరుతుంది. ప్రస్తుతం దీనిపై ఇప్పటికే వివిధ రాజకీయపార్టీల ప్రతినిధులతో సమావేశాలు ఏర్పాటుచేసి ఆర్‌విఎం పనితీరును ప్రదర్శించారు. అయితే సుమారు 13 రాజకీయ పక్షాలు ఈ విధానంపై  కొన్ని అనుమానాలు వ్యక్తం చేశారు. ఈ తరుణంలో ఆర్‌విఎంలను ఎంతవరకు ఆమోదిస్తారన్నది అనుమానంగా ఉంది. అయితే రాబోయే ఎన్నికల్లో దేశవ్యాప్తంగా ఆర్‌విఎంలు ఉపయోగించేందుకు ఎన్నికల కమిషన్ రంగం సిద్ధం చేస్తోంది. లోపాలు సరిదిద్ది, రాజకీయ పార్టీల అనుమానాలు నివృత్తి చేస్తే ఆర్‌విఎంల ఉపయోగం సత్ఫలితాలు ఇచ్చే అవకాశం ఉంది.

– డాక్టర్ గిరీష్‌కుమార్ సంఘీ



# చిరు ధాన్యాలే ఆరోగ్య సిరులు

### చిరుధాన్యాలు

చిరుధాన్యాలు మానవాళికి ఒక విలువైన సహజ బహుమతి. కనుక 2023ను అంతర్జాతీయ చిరుధాన్య సంవత్సరంగా ప్రకటించడం యావత్తు మానవాళికీ బహుమతి కన్నా గొప్పదే. చిరుధాన్యాలను భారతీయ వంటకాల్లో అనాదిగా ఉపయోగిస్తున్నారు. అయితే, ఆహార భద్రతకు ఉద్దేశించిన 1960లో

**కవర్ స్టోరీ**

సండే డెస్క్

నాటి హరిత విప్లవం వీటి ప్రాముఖ్యాన్ని తగ్గించింది. కాలక్రమంలో చిరుధాన్యాలపై మనకు శ్రద్ధ తగ్గి, అది మన ఆహారం నుంచి అదృశ్యమైంది. ఫలితంగా చిరుధాన్యాల సాగు కూడా క్షీణించింది.

హరిత విప్లవానికి ముందు మొత్తం తృణధాన్యాల పంటల్లో చిరుధాన్యాల వాటి 40 శాతంగా ఉండేది. తర్వాతి కాలంలో పప్పుధాన్యాలు, నూనెగింజలు, మొక్కజొన్న వంటి వాణిజ్య పంటలపై దృష్టి మళ్లడంతో చిరు ధాన్యాల సాగు సుమారు ఇరవై శాతానికి తగ్గిపోయింది. వాణిజ్య పంటలు లాభదాయకమేగాక రకరకాల రాయితీలు, ప్రభుత్వ కొనుగోల్లు, ప్రజా పంపిణీ వ్యవస్థలో చేర్చడం వంటి విధానాలు వాటి సాగును ప్రోత్సహించాయి. అయితే ఇప్పుడు ఆహారపు అలవాట్లలో మార్పుతో శక్తి సమృద్ధ సన్న తృణధాన్యాలకు మన ఆహారంలో ప్రాధాన్యం తిరిగి మొదలైంది. చిరుధాన్యాలు మన దేశానికి కొత్తేమీ కాదు. లోగడ పరిమిత సౌకర్యాలుండే గ్రామీణ వాతావరణంలో చిన్న రైతులు కూడా తమ అవసరాలకు తగినట్లు తృణ ధాన్యాలు పండించే పరిస్థితులుండేవి. కుటుంబ అవసరాలకు పోగా మిగిలిన పంటను అమ్ముకునేవారు. రానురానూ లాభార్జన ప్రధానంగా వ్యవసాయంలో పోటీ పెరిగింది.భారత ప్రతిపాదన మేరకు ప్రపంచం 2023ను అంతర్జాతీయ చిరుధాన్య సంవత్సరంగా నిర్వహించుకుంటోంది. దేశా వ్యాప్తంగా పోషకాహార భద్రత సాధనలో చిరుధాన్యాల ప్రాధాన్యాన్ని, పాత్రను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం ఈ దిశగా అనేక చర్యలు చేపట్టింది. చిరుధాన్యాలను పోషక తృణధాన్యాలుగా గుర్తించడమే కాకుండా, 2018వ సంవత్సరాన్ని జాతీయ చిరుధాన్య సంవత్సరంగా ప్రకటించింది.



ఇది అంతర్జాతీయ చిరుధాన్య సంవత్సరం. దేశ ప్రజలకు పౌష్టికాహారం అందాలంటే చిరుధాన్యాలే చిరునామా అని గుర్తించిన భారత్ ప్రపంచాన్నంతటినీ ఆరోగ్యవంతం చేయడానికి నడుం బిగించింది. భారత్ చొరవతో ఐక్యరాజ్యసమితి ఈ యేడాదిని 'అంతర్జాతీయ చిరు ధాన్య సంవత్సరం'గా ప్రకటించింది. చిరుధాన్యాలు మానవాళికి ఒక విలువైన సహజ బహుమతి. ఒకప్పుడు తృణ ధాన్య పంటల్లో చిరు ధాన్యాల వాటా **40** శాతం ఉండేది. రకరకాల కారణాల వల్ల తర్వాత అది **20** శాతానికి పడిపోయింది. దానిని మళ్లీ **50** శాతానికైనా పెంచడానికి కేంద్రం ప్రయత్నాలు చేస్తోంది. ప్రజలకు పౌష్టికత అందించడంలో చిరుధాన్యాల ప్రాముఖ్యతను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం వాటికి దేశ విదేశాల్లో తగినంత డిమాండ్‌ను సృష్టించింది. రాగులు, జొన్నలు, సజ్జలు, కొర్రలు, అరికెలు.. ఇంకా అనేక చిరుధాన్యాలు మనకు ప్రకృతి ఇచ్చిన వరం. దేశంలోని చాలా రాష్ట్రాలలో రెండు మూడు రకాల చిరుధాన్యాలు ఉత్పత్తవుతున్నాయి. దేశంలో **9** రకాల పంటలకు ఎక్కువ గిరాకీ ఉంది. ఎగుమతులు కూడా గణనీయంగా పెరిగాయి. చిరుధాన్యాలపై ప్రజలలో మరింత చైతన్యం పెరిగితే భారత్ మొత్తం ఆరోగ్య సమాజంగా మారుతుంది.

# ముతక ధాన్యాలంటే?

- ముతక ధాన్యాలు సాధారణంగా సన్నధాన్య పంటల వర్గీకరణ కిందకు వస్తాయి. వాటిని పోషక లేదా తక్కువ నీటితో పండే ధాన్యాలుగా పిలుస్తారు. వీటిలో జొన్న, సజ్జ, రాగి, సామ, కొర్ర, వరిగ, అరికె తదితర చిరుధాన్యాలున్నాయి.
- చిరుధాన్యాలు మెట్టభూముల్లో, తక్కువ నీటితోనే పండుతాయి. భారతదేశంలో ముతక తృణధాన్యాలను ప్రధానంగా తక్కువ నుంచి మధ్యస్థ వర్షపాతం(200-800 మి.మీ.) గల రాష్ట్రాల్లో పండిస్తారు.
- దక్షిణ-సహారా ఆఫ్రికా, ఆసియాలోని చిన్నకారు, మెట్టభూముల రైతులకు చిరుధాన్యాలు సహజ ఆహారంలో భాగం. ఈ పోషక సమృద్ధ పంటలే అక్కడి రైతులకు ప్రధాన జీవనాధారం.
- చిరుధాన్యాలను ఆహారం, పశుగ్రాసంగానే కాకుండా జీవ ఇంధనం, మద్యం తయారీలోనూ వాడుతారు. అందుకే వీటిని అత్యుత్తమ ఆహారంగా పిలుస్తారు. ఇవి వినియోగదారులకు, రైతులకే గాక భూగోళానికీ మేలు చేస్తాయి.

అంతేగాక, అంతర్జాతీయ చిరుధాన్య సంవత్సరంపై ప్రకటనతో పాటు విభిన్న స్వల్ప స్థాయి విధానాలను ఐక్యరాజ్య సమితి సర్వసభ్య సమావేశంలో భారత్ ప్రతిపాదించింది.

భారతీయ సంప్రదాయం, సంస్కృతి, పద్ధతులు, సహజ ఉత్పత్తులు.. ఇలా ప్రకృతి ద్వారా మనకు అందిన ప్రతిఒక్కటీ ఏ మనిషినైనా ఆరోగ్యంగా ఉంచుతాయనడంలో సందేహం లేదు. కాలక్రమంలో ఆధునికత పేరిట, తీరికలేని జీవన శైలి వల్ల మనం ఎన్నో మంచి విషయాలను క్రమంగా మరచిపోతున్నాం. అభివృద్ధి పేరిట అనేక అనవసర పద్ధతులను జీవితంలో అనుసరిస్తున్నాం.

అభివృద్ధి అవసరమే.. కానీ ఆ ప్రగతి, ప్రకృతి మమేకమైతేనే మానవ జీవనానికే కాకుండా, దేశం మొత్తానికీ ఎంతో మేలు చేస్తుంది. ప్రస్తుతం మనం ఎన్నో ఉత్పత్తులు చూస్తున్నాం, వాటికి అధిక ధర చెల్లిస్తున్నాం. ఇలాంటి వాటిలో కొన్ని రకాల విత్తనాలను ఏ ఒక్కరూ భద్రపరచరు. రైతులు వాటిని విత్తనైనా విత్తరు. కానీ ప్రకృతి సహజంగా ఆయా రుతువుల్లో అవి ఉత్పత్తి అవుతున్నాయి. వాటి విలువ తెలిసినవారు ఆ ఉత్పత్తులను వాడుతున్నారు. మొత్తం మీద ప్రకృతిలో సమతూకం బాధ్యతను దేవుడే చూసుకుంటున్నాడు. కోవిడ్ మహమ్మారి విషయానికొస్తే ప్రపంచానికి ఇది మొదటిదో లేదా చివరిదో కాదు. మరిన్ని మహమ్మారులు విరుచుకుపడితే అవి మరింత



ప్రాణాంతకం అవుతాయి. అందువల్ల ఆహార భద్రత సమస్యలను అధిగమించాల్సిన దృష్ట్యా అంతర్జాతీయ చిరుధాన్య సంవత్సరానికి మరింత ప్రాధాన్యం ఏర్పడింది.

ఈ సందర్భంగానే మానవాళి పండించిన తొలి పంటల్లో చిరుధాన్యాలు కూడా ఒకటని చెప్పవచ్చు. ఏదేమైనా పోషక సమృద్ధ వనరులైన చిరుధాన్యాలను భవిష్యత్తు ఆహారంగా పరిగణించడం తప్పనిసరి.

## చిరుధాన్యాల్లో అగ్రగామిగా భారత్ ఆవిర్భావం

దేశ విదేశాల్లో చిరుధాన్యాలు లేదా పోషక తృణ ధాన్యాలకు ప్రోత్సాహం దిశగా భారత ప్రభుత్వం వినూత్న కార్యక్రమం చేపట్టింది. వీటి రుచే వీటి ప్రత్యేకత. ఆ మేరకు చిరుధాన్యాల ఎగుమతి మాత్రమేగాక, వాటిని ప్రజానీకానికి చేరువ చేయడం, వారి ఆరోగ్య పరిరక్షణ కూడా భారత్ లక్ష్యాలు. కోవిడ్ లాంటి మహమ్మారితో ప్రపంచం సతమతమవుతున్న తరుణంలోనే భారత్ ఈ దిశగా ఆలోచించింది. తదనుగుణంగా దీన్ని ప్రపంచ వ్యాప్తం చేసే యోచనతో అన్ని ప్రభుత్వ సంస్థలు, రాయబార కార్యాలయాలు నిర్వహించే అన్ని కార్యక్రమాల్లో భారతదేశం నుంచి పోషక చిరుధాన్యాలను, ఆహార పదార్థాలను మెరుగైన రీతిలో అందించేందుకు ప్రభుత్వం యత్నిస్తోంది. దీని ప్రత్యేకతను ప్రజలకు తెలియజేయాల్సిన నేపథ్యంలో సదరు ప్రక్రియ ఈ సంవత్సరం పొడవునా కొనసాగుతుంది. దీర్ఘకాలిక వ్యూహంతో ఉత్తేజం చిరుధాన్యాలతో పాటు ఇతర పోషక తృణధాన్యాలకు దేశంలోనే కాకుండా విదేశాల్లోనూ ప్రాచుర్యం పెంచడానికి ప్రభుత్వం అనేక కార్యక్రమాలను



నిర్వహిస్తోంది. అంతేకాకుండా వ్యవసాయ-రైతు సంక్షేమ శాఖ(డిఎ అండ్ ఎఫ్.డబ్ల్యు), వ్యవసాయ విద్యా-పరిశోధక విభాగం(డిఎఆర్ఇ) సహకారంతో అన్ని మంత్రిత్వ శాఖలు, విభాగాలు పోషక తృణధాన్యాలపై ప్రచారం చేపడతాయి. ఇక ఉత్పత్తి, వినియోగం, ఎగుమతులు, ప్రత్యేక ముద్ర తదితరాల పెంపు వ్యూహాలపై అంతర్జాతీయ చిరుధాన్య కార్యాచరణ ప్రణాళిక దృష్టి సారిస్తుంది.

చిరుధాన్యాలను ప్రోత్సహించడంలో భాగంగా ప్రధానమంత్రి స్వయం సమృద్ధ భారతం కార్యక్రమం ప్రకటన సందర్భంగా కేంద్ర ప్రభుత్వం మార్చి 31న ఆహార తయారీ పరిశ్రమకు రూ.10,900 కోట్లతో ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహకం (పిఎల్ఐ) పథకాన్ని ఆమోదించింది. ఈ పథకం 2021-22 నుంచి 2026-27 వరకు ఏడేళ్లపాటు అమలులో ఉంటుంది.

ప్రస్తుత అంతర్జాతీయ చిరుధాన్య సంవత్సరంలో వాటి ఉత్పత్తి, వినియోగం, గిరాకీ అన్నీ పెరుగుతాయి. భారత్ ప్రపంచంలోనే పెద్ద ఎగుమతిదారుగా ఆవిర్భవిస్తుంది. మానవాళికి ఇంతకన్నా గొప్ప బహుమతి ఏదీ ఉండదు. చిరుధాన్యాలు అనాదిగా భారతీయ వ్యవసాయం, సంస్కృతి, నాగరికతలో భాగం. వేదాల్లోనూ ముతక ధాన్యాల ప్రస్తావన కనిపించడం ఇందుకు నిదర్శనం. దేశంలోని ప్రతి ప్రాంత ఆహార, పానీయాల్లో చిరుధాన్యాల జాడను చూడవచ్చు. మన వైవిధ్య సంస్కృతుల తరహాలోనే చిరుధాన్యాల్లోనూ చాలా రకాలున్నాయి. భారత్ అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరం ప్రకటనకు చొరవ చూపిన నేపథ్యంలో ఇప్పుడు దానిని ఒక ప్రజా ఉద్యమంగా మలచే బాధ్యత కూడా మన దేశానిదే అవుతుంది. ❍

## సజ్జలతో ప్రయోజనాలు

☛ రక్తంలో అధిక కొవ్వులు, వాటి ఫలితంగా గుండె రక్తనాళాల్లో పూడికను నియంత్రించడంతో పాటు ముప్పును తప్పించడంలో సజ్జ ఎంతో ప్రయోజనకరం.

☛ బరువు తగ్గడం, 'బిఎంఐ'తో పాటు అధిక రక్తపోటు నియంత్రణలో తోడ్పడుతుందని అధ్యయనాల్లో తేలింది.

☛ భారతదేశంలో సజ్జను సాధారణంగా పప్పుధాన్యాలతో వినియోగిస్తారు. ఇది పోషకాలను చేస్తుంది. ఎమైనో యాసిడ్ శాతాన్ని పెంచుతుంది. పోషకాలు పూర్తిగా జీర్ణం కావడానికి తోడ్పడుతుంది.

☛ తక్షణ వంటకు, తక్షణ వినియోగానికి అనువైన ఉత్పత్తుల విభాగాల్లో సజ్జతో తయారైన విలువ జోడింపు ఉత్పత్తులు సులభంగా లభించడమేగాక పట్టణ జనాభాకు ఎంతో సౌలభ్యంగా ఉంటాయి.

☛ సజ్జ ద్వంద్వ ప్రయోజనాల కోసం అంటే మనకు ఆహారంగానూ, పశువులకు మేతగానూ ఉపయోగపడుతుంది. సజ్జ సాగు మరింత పెరిగేందుకు ఈ అంశం తోడ్పడుతుంది.

☛ కర్బన ఉద్గార జాడ తగ్గించడంలోనూ సజ్జసాగు దోహదం చేస్తుంది.



## ప్రోత్సాహక ఎగుమతి వేదిక కేంద్రం

☛ చిరుధాన్యాలు సహా సంభావ్య ఉత్పత్తుల ఎగుమతులను వేగిరపరచేందుకు పోషక ధాన్యాల సరఫరా శ్రేణిలో అవరోధాల తొలగింపు నిమిత్తం 'పోషక తృణధాన్య ఎగుమతి ప్రోత్సాహక వేదిక'ను కేంద్రం ఏర్పాటు చేసింది.

☛ బియ్యం, గోధుమల వంటి సర్వసాధారణ వినియోగ ధాన్యాల కన్నా చిరుధాన్యాల్లో అధిక పోషక విలువలున్నాయి. ఈ మేరకు కాల్షియం, ఇనుము, పీచు సమృద్ధిగా ఉంటాయి. పిల్లల ఆరోగ్యకరమైన ఎదుగుదలకు కావాల్సిన పోషకాలను బలవర్ధకం చేయడంలో ఇవి తోడ్పడతాయి. శిశు ఆహారం, పోషక ఉత్పత్తుల్లో చిరుధాన్యాల వాడకం కూడా పెరుగుతోంది.

☛ 'డిజిసిఐఎస్' సమాచారం 2021-22 ఆర్థిక సంవత్సరంలో 1,59,332.16 టన్నుల ఎగుమతితో తృణధాన్య ఎగుమతులలో భారత్ 8.02 శాతం వృద్ధి నమోదు చేయగా, అంతకు ముందు సంవత్సరం ఈ ఎగుమతులు 1,47,501,08 టన్నులుగా నమోదయ్యాయి.

☛ భారత్ ముతక తృణ ధాన్యాలు ఎగుమతి చేసే ప్రధాన దేశాలు: యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, నేపాల్, సౌదీ అరేబియా, లిబియా, ఒమన్, ఈజిప్ట్, ట్యునీషియా, యెమెన్, యునైటెడ్ కింగ్‌డమ్, అమెరికా. ఈ దేశాలకు ఎగుమతి చేసే ముతక తృణధాన్యాలలో సజ్జ, రాగి, కొర్రలు, జొన్న, బక్వీట్(గోధుమలో ఒక రకం) ఉన్నాయి. దేశంలో 16 ప్రధాన రకాల ముతక తృణధాన్యాల సాగు, ఎగుమతి జరుగుతున్నాయి. వీటిలో జొన్న, సజ్జ, రాగి, కొర్రలు, వరిగ, అరికె, ఊదలు, సామలు, అండకొర్రలు మొదలైనవి ఉన్నాయి.

☛ చిరుధాన్యాలకు విలువ జోడింపు, రైతుల ఆదాయం పెంపు దిశగా 'ఐఐఎంఆర్'తో 'అపెడా' ఒక అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. మరోవైపు ఆసియాలోని అతిపెద్ద 'బి2బి' అంతర్జాతీయ ఆహార-ఆతిథ్య ప్రదర్శన 'ఆహార్ ఫుడ్ ఫెయిర్' సందర్భంగా అన్ని వయసుల వారికీ తగిన ముతక తృణధాన్య ఉత్పత్తులను అపెడా 5 రూపాయల నుంచి 15 రూపాయల వరకు సరసమైన ధరతో అందించడం ప్రారంభించింది.

# మహిమాన్వితమైన అష్టాదశ శక్తిపీఠాలు



పురాణ పురుషులతో సమానంగా స్త్రీలను కూడా పూజించే సంప్రదాయం ఒక్క హిందూమతంలోనే ఉందని చెప్పవచ్చు. విధాత అయిన బ్రహ్మను పూజించినట్లుగానే ఆయన భార్య అయిన సరస్వతీ దేవిని చదువుల తల్లిగా పూజిస్తాం. సిరిసంపదలకు లక్ష్మీదేవిని, శక్తిస్వరూపిణిగా పార్వతీదేవిని పూజిస్తాం. అంతేకాకుండా మహాకాళమ్మ, పోచమ్మ, మైసమ్మ, పోలేరమ్మ.. ఇలా ఎంతో మంది గ్రామీణ దేవతలను పూజిస్తాం. గ్రామ దేవత లేని ఊరంటూ ఉండదు మన తెలుగు రాష్ట్రాల్లో. దక్షుడు తన కూతురు సతీదేవి వివాహం చేయాలనుకుని స్వయంవరం ప్రకటిస్తాడు. కానీ సతీదేవి తల్లిదండ్రుల అభీష్టానికి విరుద్ధంగా పరమేశ్వరుణ్ణి వివాహం చేసుకుంటుంది. సతీదేవి పార్వతీగా మారిపోతుంది. కూతురు చేసిన పనికి దక్షుడు ఆగ్రహోదగ్రుడవుతాడు. అంతేకాకుండా పాప పరిహారంగా యజ్ఞం చేయాలనుకుని- దేవతలను, రాజులను పిలుస్తాడు. కానీ కూతురు, అల్లుడిని మాత్రం పిలవడు.

శివుడు వద్దన్నా వినకుండా పార్వతి తండ్రి చేస్తున్న యజ్ఞానికి వెళ్తుంది. పిలవని పేరంటానికి వచ్చిన కూతురిని అందరిముందు అవమానిస్తాడు దక్షుడు. అవమానం భరించలేక పార్వతి అగ్నిలో దూకుతుంది. విషయం తెలుసుకున్న శివుడు వీరభద్రుణ్ణి సృష్టించి యజ్ఞాన్ని పూర్తిగా నాశనం చేయించి, దక్షుడు తల నరికిస్తాడు. జరుగుతున్న బీభత్సాన్ని నివారించటానికి బ్రహ్మ, విష్ణుమూర్తి మొదలైన దేవతలు పరమేశ్వరుడిని శాంతింపచేయడంతో మేక తలను దక్షుడికి అమర్చి తిరిగి బతికిస్తాడు శివుడు. సగం కాలిన పార్వతి శరీరాన్ని తీసుకొని కైలాసం వెళ్లి శివతాండవం చేస్తాడు. అది కాస్తా ప్రళయ తాండవం అవుతుంది. విశ్వమంతా కంపించిపోతుంది. అప్పుడు పార్వతీదేవి సగం కాలిన శరీరం నుండి కొన్ని భాగాలు భూమి పైన పడతాయి. అలా పడిన ప్రదేశాలు 18 శక్తిపీఠాలుగా ఏర్పడ్డాయని పురాణాలు తెలియజేస్తున్నాయి.

## శ్రీ శాంకరీదేవి



అష్టాదశ శక్తిపీఠాలలో మొట్టమొదటిది ఈ శక్తి పీఠం. ఇది శ్రీలంకలో పశ్చిమ సముద్ర తీరంలో ట్రింకోమలి నగరంలో వెలసింది. శాంకరీదేవి దుష్టశక్తులను సంహరిస్తూ ధర్మాన్ని రక్షిస్తూ పుణ్యాత్ములను కాపాడుతుంటుంది. శ్రీలంక వెళ్లిన పర్యాటకులు, భక్తులు ఈ దేవిని దర్శించుకుంటారు.

## శ్రీ కామాక్షిదేవి



అష్టాదశ శక్తిపీఠాల్లో రెండవది కంచికామాక్షి. దక్షిణ భారతదేశం ముఖ్యంగా తమిళనాడు ప్రాంతం ఆలయాలకు ప్రసిద్ధి. కామాక్షి ఆలయంలోని ప్రాకారాలు, స్తంభాలు ఎంతో కళాత్మకంగా ఉంటాయి. ఇక్కడ మొట్టమొదట అమ్మవారిని ఆవు, దూడ దర్శించుకుంటాయి. తరువాత గజరాజు ప్రవేశిస్తాడు. ఆ తరువాతే భక్తులకు అమ్మవారి దర్శనం మొదలవుతుంది. ఇక్కడికి దగ్గర్లోనే విష్ణుకంచి, శివకంచి, ఆళ్వారుల దివ్య క్షేత్రాలున్నాయి.

## శ్రీ శృంఖలాదేవి



గంగానది ఉత్తరప్రదేశ్, బీహార్ రాష్ట్రాల గుండా ప్రవహించి పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో ఈ శృంఖలాదేవి శక్తిపీఠం దగ్గరే సాగర్‌లో కలుస్తుంది గంగ. భక్తులు కలకత్తా నుండి 130 కి.మీ. దూరంలో ఉన్న ఈ శక్తిపీఠానికి బస్సులో చేరుకోవచ్చు.

## శ్రీ చాముండేశ్వరీదేవి

"అంబే పరమేశ్వరి అఖిలాండేశ్వరి ఆది పరాశక్తిదేవిని కీర్తిస్తూ ఉంటారు. మైసూరు నగర శివార్లలో చాముండి హిల్స్‌పై 17వ శతాబ్దంలో ఈ ఆలయాన్ని వొడియార్లు నిర్మించినట్లు తెలుస్తోంది. అమ్మవారిని దర్శనం చేసుకోవడానికి రెండు దారులున్నాయి. ఒకటి: మెట్లదారి, రెండు: ఘాట్ రోడ్. గర్భగుడిపై ఉన్న శిల్పాలు మన శిల్పకళా వైభవానికి మచ్చుతునకలు.



గర్భగుడి చుట్టూ ఉన్న పన్నెండు నంది విగ్రహాలు భక్తులను ఆకట్టుకుంటాయి. మైసూరు రాజుల, విజయనగర రాజుల ఆధ్వర్యంలో ఈ ఆలయం బాగా అభివృద్ధి చెందింది. పూర్వం ఈ నగరాన్ని మహిశాసుర పురం అని పిలిచేవారట. అందుకే మైసూరు అని పేరు ఏర్పడిందంటారు. అమ్మవారి గుడి ఎదురుగా సర్వాలంకార భూషితుడైన మహిషాసురుని విగ్రహం ఉంది.

## శ్రీ జోగులాంబాదేవి



అష్టాదశ శక్తిపీఠాలలో ఐదవది శ్రీ జోగులాంబా దేవి ఆలయం. బాల బ్రహ్మేశ్వరాలయంగా పేరు ప్రఖ్యాతులు గడించింది. తెలంగాణ రాష్ట్రంలో మహబూబ్ నగర్ నుండి కర్నూలు వెళ్లే రహదారికి ఐదు కి.మీ. దూరంలో అలంపురంలో వెలసింది ఈ శక్తిపీఠం. ఈ క్షేత్ర చరిత్ర చాలా పురాతనమైనది. ఇక్కడ ఇతిహాస, పురాతన అవశేషాల నెన్నిటినో పరిశీలించవచ్చు. 6 నుండి 12వ శతాబ్దాల వరకు చెందిన భారతీయ వాస్తు శిల్పాలు ఎన్నో ఉన్నాయి. బాదామి చాళుక్యుల హయాంలో అలంపురంలోని నవబ్రహ్మ ఆలయాలను నిర్మించినట్లు చారిత్రక ఆధారాల వల్ల తెలుస్తోంది.

## శ్రీ భ్రమరాంబాదేవి

జ్యోతిర్లింగాలలో రెండవది అయిన శ్రీశైల మల్లికార్జున జ్యోతిర్లింగం, శ్రీ భ్రమరాం  భాదేవి శక్తిపీఠం ఒకేచోట ఉండడం తెలుగువారి అదృష్టమని చెప్పవచ్చు. శాతవాహనులు, ఇక్ష్వాకులు, కాకతీయులు, విజయనగర శ్రీకృష్ణదేవరాయలు మొదలుకొని రాజులెందరో ఈ ఆలయాలను అభివృద్ధి చేసారు. దేవాలయం నాలుగు వైపుల ఎత్తయిన గోపురాలు, చుట్టూ ఎన్నో చిన్న చిన్న ఆలయాలు ఉన్నాయి.

## శ్రీ మహాలక్ష్మీదేవి



ధన, ధాన్య, సంపదలను ప్రసాదించే శక్తిపీఠం శ్రీ మహాలక్ష్మి అమ్మవారిది. ఇది మహారాష్ట్రలోని కొల్హాపూర్‌లో ఉంది. దగ్గరలోనే ఐదు ఉపనదులు పంచగంగగా ప్రవహించి కృష్ణా నదిలో సంగమిస్తాయి. ఈ దేవాలయం ఆధునిక, పురాతన పద్ధతుల కలబోతగా ఉంటుంది. మహాలక్ష్మిదేవికి రెండు వైపుల మహాకాళి, మహా సరస్వతి అమ్మవార్లు కొలువై ఉంటారు. దత్తాత్రేయ, సూర్యనారాయణ, గణపతి, నవగ్రహ ఆలయాలు సైతం ఉన్నాయి.

## శ్రీ ఏకవీరాదేవి

ఈ శక్తిపీఠం పైన కొన్ని భిన్నాభిప్రా యాలు ఉన్నాయి. మహారాష్ట్ర లోని మహోర్ రేణుకా మాత మందిరమే



శక్తిపీఠం అని అంటారు. కానీ మహోర్‌కు పది కి.మీ. దూరంలో ఉన్న ఏకవీరా మందిరం అసలైన శక్తిపీఠం అంటారు. అక్కడ కొన్ని ఆధారాలు కూడా ఉన్నాయి. అయితే చాలా చిన్నది. ఆలయం నాందేడ్‌కు 140 కి.మీ దూరంలో ఉంది.

## శ్రీ మహాకాళికాదేవి

మధ్యప్రదేశ్ రాష్ట్రంలో ఉజ్జయినిలో ఉంది ఈ శక్తిపీఠం. శ్రీశైలంలో లాగ ఇక్కడ జ్యోతిర్లింగం, శక్తిపీఠం ఒకే దగ్గర ఉన్నాయి.



శ్రీకృష్ణుడు, మహాకవి కాళిదాసు, విక్రమార్క వంశీ యులు ఈ అమ్మావారిని పూజించినట్టు చారిత్రక ఆధారాలు ఉన్నాయి. ఈ ఆలయానికి వెళ్లే దారిలో బలరామ కృష్ణులు, కుచేలుడు విద్యాభ్యాసం చేసిన సాందీపుని ఆశ్రమం ఉంది.

## శ్రీ పురుహూతికా దేవి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పిఠాపురంలో వెలసింది ఈ శక్తిపీఠం. దీన్ని



కుక్కుటేశ్వర క్షేత్రం అని కూడా పిలుస్తారు. కుక్కుటమంటే కోడి. ఈ క్షేత్రంలో అమ్మవారి ముఖం దక్షిణ దిశగా ఉంటుంది. రాజమండ్రి నుండి 70 కి.మీ. దూరంలో పిఠాపురం ఉంటుంది.

## శ్రీ గిరిజాదేవి

ఒడిశా రాష్ట్రంలోని జాజ్‌పూర్ దగ్గర వైతరణి నదీ తీరంలో ఉంది ఈ శక్తి పీఠం. ఇక్కడ చేసే ఆబ్దికాది క్రియలు



పితృదేవతలకు నరక బాధలు తప్పించి స్వర్గప్రాప్తిని కలుగజేస్తాయని ప్రతీతి. ఇక్కడ అమ్మవారిని గిరిజాదేవి అని పిలుస్తారు. శిల్పాకళా వైభవం అత్యంత సుందరంగా ఉంటుంది.

## శ్రీ మాణిక్యాంబా దేవి



ఆంధ్రప్రదేశ్‌లోని ద్రాక్షా రామంలో ఉంది ఈ శక్తిపీఠం. ఈ క్షేత్రాన్ని దక్షిణ కాశిగా కూడా పిలుస్తారు. దక్షుడు పరిపాలించిన రాజ్యం కనుక ద్రాక్షారామం అని పేరొచ్చింది. ఈ శక్తిపీఠానికి చుట్టుపక్కల చంద్రుడు ప్రతిష్ఠించిన సోమేశ్వర ఆలయాలు ఎనిమిది ఉన్నాయి. రాజమండ్రి నుండి 70 కి.మీ.ల దూరంలో ఉన్న ద్రాక్షారామానికి బస్సు సౌకర్యం ఉంది.

## శ్రీ కామాఖ్య



అస్సాం రాష్ట్రంలో గౌహాతీ దగ్గర బ్రహ్మపుత్రా నదీ తీరంలో ఉంది ఈ శక్తి పీఠం. నీలాచల పర్వతం వద్ద కొండల నడుమ వెలసింది. ఈ ఆలయం నేలకు కొంచెం కిందకు ఉంటుంది. ఆలయం లోపల పెద్ద గుహ. భూగర్భం లోపలికి మెట్లు ఉంటాయి. శిల రూపంలో ఉంటుంది అమ్మవారు శిల నుండి నీటినే తీర్థంగా ఇస్తారు. గర్భగుడిలో మాతంగి, కమల అమ్మవార్ల విగ్రహాలున్నాయి.

## శ్రీ మాధవేశ్వరీదేవి

అలహాబాద్‌లోని ప్రయాగలో త్రివేణి సంగమం దగ్గర ఉంది శ్రీమాధవేశ్వరీ దేవి శక్తిపీఠం. ఇక్కడికి మూడు కి.మీ. దూరంలో గంగా, యమున, సర్వతిలు నదుల త్రివేణీ సంగమ క్షేత్రం ఉంది.

## శ్రీ జ్వాలాముఖి



హిమాచల్‌ప్రదేశ్‌లోని జ్వాలాముఖిలో వెలసింది ఈ శక్తి పీఠం. శక్తి పీఠాలన్నింటిలోకి ఇది ప్రత్యేకం. గర్భగుడి మధ్యలో ఉన్న కుండలో రెండు వైపుల నుండి అగ్ని వస్తుంటుంది. అమ్మవారి గుడి ఎదురుగా నవ దుర్గ ఆలయాలున్నాయి. పంజాబ్‌లోని పఠాన్‌కోట నుండి హిమాచల్ ప్రదేశ్‌లోని జ్వాలాముఖి శక్తిపీఠం ఎనభై కి.మీ. దూరంలో ఉంది.

## శ్రీమాంగల్యగౌరీదేవి



బీహార్ రాష్ట్రంలోని గయలో వెలసింది ఈ శక్తి పీఠం. దేవాలయం కొండ మీద ఉంది. ఇక్కడికి కొంచెం దూరంలో సిద్ధార్థుడికి జ్ఞానోదయమైన బోధివృక్షం ఉంది. సిద్ధార్థుడు బుద్ధుడిగా మారింది ఇక్కడే.



## శ్రీ విశాలాక్షిదేవి

ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో వారణాసిలో ఉంది ఈ శక్తి పీఠం. విశాలమైన కళ్లు కలిగివున్నది కనుక విశాలాక్షి అని పేరు వచ్చింది. ఇతర ఆలయాలన్ని ఉత్తర, భారత సంప్రదాయ పద్ధతిలో వుంటే అమ్మావారి గుడి దక్షిణాది ముఖ్యంగా తెలుగువారి సంప్రదాయంలో ఉంటుంది. అమ్మవారి చుట్టూ గుళ్లు, గోపురాలు ఎన్నో ఉన్నాయి.



## శ్రీ సరస్వతీ దేవి

అష్టాదశ శక్తి పీఠాలలో చివరి శక్తి పీఠం శ్రీ సరస్వతీ దేవి శక్తిపీఠం. కాశ్మీర్ ప్రాంతంలో ఉన్న శక్తిపీఠాన్ని సరస్వతీ పీఠంగా చెబుతారు. కాశ్మీర్‌లోని స్థానికులు సరస్వతీ దేవిని కీర్‌భవాని అని పిలుస్తారు.

కీర్‌భవాని ఆలయం శ్రీనగర్‌కు సుమారు పది కి.మీ. దూరంలో ఉంది. సరస్వతి పరమ శాంతమూర్తి. నాలుగు చేతులతో వీణ, పుస్తకం, జపమాల ధరించి అభయ ముద్రతో ప్రకాశిస్తుంటుంది. స్త్రీని శక్తి స్వరూపిణిగా, దేవతగా కొలుస్తారనడానికి ఈ శక్తిపీఠాలే నిదర్శనం. తెలుగు రాష్ట్రాల్లోని శక్తి పీఠాలతో మిగతా వాటిని దర్శించుకోవడానికి రైలు, బస్సు సౌకర్యాలు ఉన్నాయి.

చక్కటి వసతి, భోజన సౌకర్యాలు లభిస్తాయి.

**- మునిగంటి శతృఘ్నచారి**



# మీకెందుకూ!

మట్టిని మూర్తిగా మలచాలనే
సంకల్పముతో
కళకు జీవం నిలపాలనే
తాపత్రయంతో/ శ్రమకు తల వంచని దేహముతో
భూమాతకు ప్రణమిల్లుతూ/ పెల్లపెల్లను నుగ్గు నుగ్గుగా చేస్తూ
నీటిధారను అర్పణగావిస్తూ
మట్టిని మూర్తిగా మలచెనో మహాశిల్పి!!
మనో సంకల్పంతో/ చేతులనే కుంచెలుగా మలిచి
మట్టిలో మట్టినే రంగరించి మూర్తికి రంగులద్ది
పూజలందుకునేలా చేసాడో కళాతపస్వి
నీ జన్మ చరితమైనది ఇలలో./ ఎంతటి భాగ్యం నీదయ్యా!
మహాశిల్పివి! కొనియాడెను యావన్మంది.
ఊహించని అనైతిక పోరు
అగ్గి రాజుకుంది మనుషుల మధ్య
భూమి కోసం, నీటి కోసం, జీవనం కోసం కాదు
కుల మతాల కోసం తలపడే మానవ మృగాలు.
మూకుమ్మడిగా దాడి చేస్తున్నాయి.
ఇది మా దైవం కాదంటూ/
ఇది మా మతచిహ్నం కాదంటూ
నేల కూలింది శిల్పం
తన ఆకారం కోల్పోతుంది.. నేల తల్లి నిర్ఘాంతపోతుంది
నాకే లేని కులమతాల
తారతమ్యాలు/
వ్యత్యాసాలు నాలో
కలిసే మీకెందుకంటూ?
శిల్పి నిరంతర శ్రమజీవి
తిరిగి మరో శిల్పానికి రూపు దిద్దుతున్నాడు
తనకు కుల మతాలు అడ్డుకాదంటూ
తన జీవితం కళకే అంకితమిస్తానంటూ
అతని స్వేదం భూమాతకు ప్రణమిల్లుతుంది.

**- రాము కోలా**

## మట్టి కౌగిలిలోకి..

కాలం నీటి బిందువుల్లో/ భద్రపరచబడింది
గడ్డిపోచల కొసన
వేళాడుతుంది
ఏ క్షణమైనా పడిపోవచ్చు
మళ్ళీ ఈ క్షణం / ఆ క్షణంతో ఏకమవచ్చు
అప్పుడు కొన్ని/ గంటలు కదలవచ్చు
అలా ఒక రోజులో/ హారం తయారవచ్చు
దాన్ని ఒక చీమలబారు
మోసుకుపోవచ్చు/ ఇంతలో ఒక పెద్ద అల
దాన్ని చెరిపేయొచ్చు
మళ్లా అందులోంచే/ ఒక చెయ్యి పైకి లేచి
మొలకెత్తొచ్చు.
దానికి కొన్ని పువ్వులు పూయొచ్చు
సాయంకాలానికి అవి
రాలిపోవచ్చు!/ ఎప్పుడూ నిరాశా
నిస్పృహలే కావు/ మధ్య మధ్యలో
కొన్ని సంతోషాలూ/ తేనె బిందువుల్లా..
నిరంతరం ఒక చర్య
ఒక పని జరుగుతూ/ పడుతూ లేస్తూ
రూపాంతరం చెందుతూ/ పరిణామం చెందుతూ
ఎత్తుపల్లాలు చూస్తూ/ మారిపోతూ మార్చుకుంటూ
పరిపక్వత చెందుతూ/ అర్థం చేసుకుంటూ
స్థిమిత పరుచుకుంటూ–
మట్టి కౌగిలిలోకి!

**- రఘు వగ్గు**

## ఎక్కణ్ణుంచో ఈ దరికి..

ఈ వారం కవిత్వం

భూమికీ ఆకాశానికీ/ ఏదో దోస్తానా వుంది
లేకుంటే../ అక్కడెక్కడో/ రాతిరి మబ్బుల్లో నుంచీ
చందురుడు వెన్నెల కురిపిస్తే
ఇక్కడ నయనానంద దృశ్యం
మనసంతా వెండిజాబిలి పారవశ్యం
చీకట్లను చీల్చుకొని/ అక్కడెక్కడో సుదూరానా
సూరీడు పొడుస్తే
ఇక్కడంతా/ వెలుగు రేఖల సందడైతది
బద్ధకాన్నీ నిద్దురమత్తును
చద్దర్లోనే సర్దేసుకొని
మేలుకొలుపుల జాతర పాటొస్తది
మనం ఎక్కడున్నమన్నది
ప్రశ్నే కాదు..
ఎంతవరకు వ్యాపించామన్నదే ముఖ్యం
గగనం నుంచి జారిన వర్షపు చుక్క
పుడమిని ముద్దాడి/ విత్తును మొలకెత్తిస్తుంది చూడు
నువ్వెక్కడో వున్నవని దిగులొద్దు
ప్రసరించు.. ప్రభవించు నలుదిశలా
నీ తాలూకు పరిధులన్నింటినీ తడుము
అదిగో..ఎక్కణ్ణుంచో పాయలు పాయలుగా
ప్రవహిస్తున్న జలం
ఈ నేలను తాకుతూ వెళుతుంది
పురాస్మృతుల్ని
తనలో కలిపేసుకుపోతుంది చూడు!

**- డా॥ కటుకోఝ్వల రమేష్**

# పుస్తక సమీక్ష

## వాట్సాప్ ప్రసారకథా సంకలనం



'ప్రసన్న' భారతి కథామంజరి 'ఓసారి చూడండి.. అంతే!' (వాట్సాప్ ప్రసార సంచిక) నిర్వహించిన డా.భట్టిప్రోలు దుర్గాలక్ష్మీ ప్రసన్నస్మారక శోభకృతు ఉగాది కథల పోటీలో బహుమతి పొందిన 25 కథలను సంకలనంగా 'గ్రంథకుటి' ప్రచురించింది. 199 కథలలోంచి ఎంపికైన కథలను చేర్చి కవి, రచయిత, సద్విమర్శకుడు, కార్టూనిస్టు సుధామ నిర్వహణలో ద్విభాష్యం రాజేశ్వరరావు అను భవజ్ఞులైన కథారచయితగా న్యాయనిర్ణేతగా 'కథామంజరి' వెలువడింది. వాట్సాప్ గ్రూప్ అడ్మిన్ 'సుధామ' నిర్వహణ సామర్థ్యం, దీక్షాదక్షతలకు, ఈ ప్రసార ప్రచురణ అందమైన కథాసంకలనంగా వెలుగు చూసింది. పెళ్లి అయిన తర్వాత తల్లిదండ్రులతో అనుబంధం 'పుట్టినిల్లు' కథలో కె.గీత, పరిస్థితులు అనుకూలించక దూరమై జీవనసంధ్యలో ఒకటైన 'సంధ్యారాగం'లో తెలికిచెర్ల విజయలక్ష్మి, ఊరి ప్రజల కోసం సేవాకార్యక్రమంగా రోడ్డు వేసిన 'బ్రతుకుబాట' కథలో ఉప్పలూరి మధుపత్ర శైలజ, ఆటోడ్రైవర్‌గా జీవనపోరాటాన్ని ఎదుర్కొన్న మహిళ ఆత్మస్థైర్యం ప్రదర్శించే కథగా 'రేపటిచూపు'లో కూర చిదంబరం, కుటుంబ ప్రేమానుబంధాలు వ్యక్తీకరించే 'బంధం'లో కె.కనకదుర్గ భారతీయసంస్కృతీ వైవిధ్య భరితమైన ఇతివృత్తాలతో వాట్సప్ ప్రసార సంచికను, అందమైన కథాసంకలనంగా అందించారు.

**(కథామంజరి ఓసారి చూడండి..అంతే!, నిర్వహణ: సుధామ, కూర్పు: ద్విభాష్యం రాజేశ్వరరావు, వెల: రూ 180, ప్రతులు: సుధామ, ఇ-107 రాజపుష్పాశ్రియ, గోల్డన్‌మైల్ రోడ్, కోకాపేట, హైదరాబాద్)** **- యర్రమిల్లి**

## మరో మాయాబజార్



డా॥ముక్తేవి భారతి ఈ పుస్తకాన్ని చదువరులకు 'అభినందన' ద్వారా పరిచయ వాక్యాలు రాసారు. చాలాకథల్లో హాస్యం, వ్యంగం, సందేశాత్మకత, ఆత్మీయత, కుటుంబబాంధ్యాయాలు కనిపిస్తాయి. 24 కథలున్నాయి ఈ సంపుటిలో. చిన్నగాంధీ తప్పెవరిది? నిర్లక్ష్యం, స్వగతం వానప్రస్థం ఎవరికి చవక? టిక్..టిక్..టిక్..లాంటి కథలు రచయిత్రి కథనాన్ని తెల్పుతాయి. 'సన్మానపత్రం' కథ చాలాబాగుంది. ఆఫీసులో రిటైరైన సుందరరావుకి సన్మానం అంతా చేస్తారు. సన్మానపత్రం రాసే బాధ్యత కృష్ణశాస్త్రికి రావడం. అందులో అందరి పేర్లు వచ్చేలా రాయమని సుందరరావు చెపుతూ నారెండవ భార్య పేరు రాయాలని కోరడం పక్కనే వున్న బంట్రోతు వీరయ్య తాను పైనెలలో రిటైర్ అవుతాను సార్, తనకూ..అంటూ అడగబోవటం, ప్రతివానికీ పొగుడుతూ రాయాలా నేను! ఛీ..ఛీ..అర్జెంటుగా వాలంటరీ రిటైర్మెంట్ తీసుకోవాలని అనుకొంటూ బాధపడే కృష్ణశాస్త్రి కథనం బాగుంది. 'కరోనా' కాలంలో మీటింగ్‌లు, సభలు, సెమినార్లు అన్ని 'జూమ్' మీటింగ్‌లే! ఈ విషయాన్ని 'జూమాయణం' కథలో చక్కగా చెప్పారు. జూమ్ కార్యక్రమాల్లో పాల్గొనే వారందరి అనుభవాలు అద్దం పట్టారు ఈ కథలో. వంగూరి చిట్టెన్‌రాజు, శాలువాచకొండగార్ల అభిప్రాయాలు పుస్తకం ప్రాధాన్యత, ప్రాముఖ్యత చెప్పాయి. హాస్యకథలు, ఆలోచింపజేసేవిగా ఉన్నాయి. రచయిత్రికి అభినందనీయురాలు.

**(మరో మాయాబజార్', రచన: రాధిక మంగిపూడి, వెల: రూ 150, ప్రతులకు: నవోదయ బుక్‌హౌస్, కాచీగూడ, హైదరాబాద్)** **- తంగిరాల చక్రవర్తి**

## చక్కటి అనుభూతి కవిత్వం



'మబ్బుల్లో సాగే అనంత..నల్లని విషాదులను..ప్రేమిస్తాను' అంటున్న బిరుదురాజు సత్య ప్రేమైకజీవి. గొప్పభావుకురాలు. 'ప్రేమ'వస్తువుగా 'ఇలా..సత్యా!" అంటూ 84 కవితలతో ఓ సంపుటి వెలువరించారు. కవితలు చదువుతుంటే ఓ Transలో రాసినట్టు అనిపిస్తుంది. తనేకాదు..పాఠకుల్ని కూడా తన్మయత్వంలో ముంచెత్తుతుంది. 'నాలో చీకటిని మోస్తాను/ వెన్నెలకు దారి తీస్తాను' ప్రేమంటేనే త్యాగమని నర్మగర్భంగా తెలియజేస్తున్నారు సత్యా. 'నాగటి చిగురేసే చీకటిగుహ' 'పొద్దు వాలితే నక్షత్రాలు పూస్తాయి/ కానీ ఎదమాట నలుపు/ కాటేయకుండా వుండదు కదా!' యిలా చీకటిని ప్రేమిస్తూ చక్కటి అనుభూతి కవిత్వం అందిస్తున్నారు కవయిత్రి. 'నాలోనిన్ను..నీలో నన్ను..వెచ్చగా కప్పుకుని ఊపిరాడని కౌగిలిలో/నన్నాదుకోవాలని నీవు..నిన్నాదుకోవాలని నేను' యిలా తమకవితలతో పరవశించి పోయిన పంక్తులు చాలానే వున్నాయి. 'రా..నాతో నాలోకిరా/ ఇద్దరమొక మౌనాల్లోకి/ మౌన యోగాల్లోకి నడుద్దాం/ అక్కడ రేయి ముసరని/ వెన్నెల వాకిళ్లలో మనసులు వాల్చుకుని' శృతిమించని శృంగారాన్ని పలికించడంలో నేర్పరి సత్య. 'నా కలల పెనిమిటివాడు/ ప్రతిరేయి కనులను మనువాడుతాడు/ పెదాల కమ్మటి తేనెలోడు/ ప్రతిపూట ముద్దుల తేరులవుతాడు' సహజ ప్రేమకాంతులు విరజిమ్ముతున్న బిరుదురాజు సత్యా అభివ్యక్తిలో కృత్రిమత యిసుమంతైనా ధ్వనించదు. **(ఇలా, రచన: సత్యా బిరుదరాజు, వెల: రూ 150, ప్రతులకు: నవోదయ బుక్‌హౌస్)** **- రమణ వెలమకన్ని**

## ప్రవాసపౌరుడి 'ముందుచూపు' కథలు

ప్రవాసి సతీష్ గొల్లపూడి న్యూజిలాండ్ వాసి. కవి నాలుగు కవితా సంపుటులను వెలయించి ఇటు స్వదేశంలో అటు విదేశంలో తెలుగువారి మన్ననలను పొందారు. తన కవిత్వంలో సమకాలీన జీవితంలోని మనుషుల స్వభావాన్ని, వారిపై మారుతోన్న టెక్నాలజీ ప్రభావాన్ని, అందువల్ల



మారుతోన్న జీవన విధానాన్ని వివరించారు. 'న్యూసీజన్' అన్న శీర్షికతో ఇంగ్లీషు భాషలో కూడా తన కవిత్వాన్ని పరిచయం చేసారు. ప్రతిభావంతులు ఎప్పుడూ ఒకే దారిన నడవరు. వివిధ ప్రక్రియలతో తమ పాటవాన్ని ప్రదర్శిస్తూ ఉంటారు. కవి సతీష్ ఈసారి కథారచనపై తన దృష్టిని మరలించారు.

18 కథల సంపుటిని ఇలా ఇప్పుడు అందిస్తున్నారు. పట్టూవిడుపు లేకపోతే, మగవాడి పెళ్లి కూడా ఎంతటి కష్టతరమవుతుందో 'పెళ్లిగోల'లో చెప్పారు.

కొన్నాళ్ల పోతే చంద్రమండలంలో కూడా ముల్కీనాన్-ముల్కీ సమస్యలు వస్తాయన్న దూరదృష్టితో 'అంతరిక్ష దేశం' కథ రాస్తారు. ప్రథమ ప్రయత్నమే అయినా, కథాలక్షణాలు, ఆకట్టుకునే తీరు, ఎత్తుగడలు కొసమెరుపులు శిల్పనైపుణ్యాలు ఆకళింపు చేసుకుని రాసిన మంచి కథలివి.

**(ప్రవాస చందమామ కథలు, రచన: సతీష్ గొల్లపూడి, వెల: రూ 150, ప్రతులకు: నవోదయ బుక్‌హౌస్, కాచిగూడ, హైదరాబాద్)**

**- కూర చిదంబరం**

# వింతలు-విశేషాలు



## దెయ్యంతో 42 ఏళ్లుగా మూతపడ్డ రైల్వే స్టేషన్

అత్యాధునిక టెక్నాలజీ అందుబాటులోకి వచ్చిన ఈ రోజుల్లో కూడా మనుషులను కొన్ని మూఢ నమ్మకాలు ఇంకా వెంటాడుతూనే ఉన్నాయి. ఇదే సమయంలో సైన్స్‌కు, సంప్రదాయాలకు నేటికీ సమాధానం దొరకని ప్రశ్నలు చాలానే ఉన్నాయి. అటువంటిదే ఇప్పుడు మనం చెప్పుకోబోయే వాస్తవ సంఘటన. కేవలం దయ్యాల భయంతో 42 సంవత్సరాలుగా ఒక రైల్వే స్టేషన్ మూతపడిందంటే మీరు నమ్ముతున్నారా? నమ్మాల్సిందే. ఇది నిజం. అన్ని ఏళ్లుగా మూతపడిందంటే అక్కడ కచ్చితంగా దెయ్యాలు ఉండి ఉంటాయా అనేది తెలని రహస్యం. పశ్చిమ బెంగాల్‌లోని పురూలియా జిల్లాలోని బేగుంకోదర్ రైల్వేస్టేషన్‌ను సంతాల్ రాణి లచన్‌కుమారి కృషితో నిర్మించబడింది. మారుమూల ప్రాంతంలోని ఈ రైల్వే స్టేషన్‌ను ప్రారంభించిన తర్వాత చుట్టుపక్కల ప్రజలకు నిత్య అవసరంగా మారింది. ఈ ప్రాంతం దేశంలోని ఇతర ప్రాంతాలకు అనుసంధానించబడింది. ఈ నేపథ్యంలో దినదిన ప్రవర్ధమానం చెంది 1960 సంవత్సరం నుండి నిత్యం రద్దీతో సందడిగా ఉండేది. కానీ వాళ్ల ఆనందం ఎక్కువ రోజులు నిలువ లేదు. 1967 సంవత్సరంలో ఈ రైల్వే స్టేషన్‌లోని ప్రస్తుత స్టేషన్ మాస్టర్ తనకు రైల్వే ట్రాక్‌పై దెయ్యం కనిపించిందని చెప్పారు. స్టేషన్ మాస్టర్ చెప్పేదాని ప్రకారం దెయ్యం తెల్లటి చీరలో ఉంది. ఆమె రాత్రి రైల్వే ట్రాక్‌పై తిరుగుతుంది. ఈ ప్రచారం వైరస్ కన్నా చాలా స్పీడుగా అన్ని ప్రాంతాలకూ వ్యాపించింది.

అంతే ఆ తర్వాత చాలా మంది వ్యక్తులు తెల్ల చీరలో దెయ్యాన్ని చూశారని పేర్కొన్నారు. ఈ రైల్వే ట్రాక్‌పై ఆత్మహత్య చేసుకున్న బాలికే దెయ్యంగా మారిందని ప్రజల్లో బలమైన విశ్వాసంగా నాటుకుపోయింది. భారతీయ రైల్వేలో 20 ఏళ్లకు పైగా పనిచేసిన సుభాశిష్ దత్తారాయ్ ఈ స్టేషన్‌కు సంబంధించిన వివరణాత్మక నివేదికను తయారు చేశారు. దెయ్యం భయం కారణంగా ఏ రైల్వే కార్మికుడు ఈ స్టేషనులో పనిచేసేందుకు సిద్ధంగా లేరని పేర్కొన్నారు. ప్రయాణికులు కూడా ఈ రైల్వే స్టేషన్‌కు రావడం మానుకున్నారు. దీంతో ప్రయాణీకులు, చివరకు అక్కడ పనిచేసేందుకు ఉద్యోగులు ఎవరూ ముందుకు రాకపోవడంతో ఈ స్టేషన్ నిర్మానుష్యంగా మారిపోయింది. ఈ నేపథ్యంలో ఆ రైల్వే స్టేషన్ 42 సంవత్సరాల పాటు మూసివేయాల్సి వచ్చిందని నివేదికలో వివరించారు. నేటికీ రైళ్ల ఈ స్టేషను గుండా వెళుతున్నప్పుడు రైలు లోపల మొత్తం నిశ్శబ్దంగా మారిపోతుందని స్పష్టం చేశారు. కాగా రైల్వే యంత్రాంగం ఈ పుకార్లను విశ్వసించనప్పటికీ ఆ క్రమంలోనే స్టేషన్ మాస్టర్, అతని కుటుంబం అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు. ఈ సంఘటన తర్వాత దెయ్యం అనే పుకారు మరింత విస్తృతంగా వ్యాపించింది. స్టేషన్ మాస్టర్ మరణానంతరం ఈ రైల్వే స్టేషన్ మీదుగా వెళ్లేందుకు ఏ రైల్వే ఉద్యోగి అంగీకరించలేదు. ఫలితంగా ఈ స్టేషనులో రైళ్ల నిలిచిపోయాయి. ఆ తర్వాత కొన్ని నెలలుగా ఈ రైల్వే స్టేషన్‌లో ఉద్యోగులను మోహరించేందుకు రైల్వే శాఖ ప్రయత్నిస్తూనే ఉంది. కానీ ఉద్యోగులెవరూ వెళ్లేందుకు సిద్ధంగా లేరు. ఇక చేసేది ఏమీ లేక రైల్వే శాఖ ఒక రోజు ఈ స్టేషన్‌ను మూసివేస్తున్నట్లు ప్రకటించింది. ఈ స్టేషనులో అన్ని సర్వీసులను నిలిపివేసిన తర్వాత ఇది వాస్తవ రూపంలో దెయ్యం రైల్వే స్టేషనుగా మారింది. 1990 దశకంలో ఈ రైల్వే స్టేషన్‌ను పున:ప్రారంభించాలని కొందరు స్థానికులు డిమాండ్ చేశారు. ఈ స్టేషన్‌ను తెరవాల్సిన అవసరం గురించి రైల్వే శాఖ ఉన్నతాధికారులు ఆలోచించారు. దాదాపు 42 ఏళ్ల తర్వాత 2009లో అప్పటి రైల్వే మంత్రి మమతా బెనర్జీ చొరవతో ఈ స్టేషన్‌ను ప్రారంభించాలని నిర్ణయించారు. ఆ తర్వాత ఇక్కడ ఓ ప్యాసింజర్ రైలు ఆగడం ప్రారంభమైంది. నేటికీ ఈ రైల్వే స్టేషన్ హాల్ట్ స్టేషన్‌గా పనిచేస్తుంది. ఒక ప్రైవేటు వెంటింగ్ కంపెనీ దీన్ని నిర్వహిస్తోంది. ఇప్పుడు ఈ స్టేషన్ మీదుగా రైలు వెళ్లినప్పుడు అందులోని ప్రయాణికులు భయాందోళనకు గురవుతారట. ఇక సాయంత్రం వేళ స్థానిక ప్రజలు సైతం ఈ స్టేషనుకు వచ్చేందుకు భయపడ తారు. ఇంకా విచిత్రం ఏమిటంటే ఈ రోజుకీ ఈ రైల్వే స్టేషన్‌లో ఒక్క ఉద్యోగి కూడా లేకపోవడం.

## ప్రపంచంలోనే అతిపెద్ద రైల్వేస్టేషన్

ప్రపంచంలోనే అతి పెద్ద రైల్వే స్టేషన్ ఇది. ఒకేసారి 40కు పైగా రైళ్ల అక్కడ ఆగేలా ఏర్పాట్లు చేశారు. ఇది ఎక్కడ



ఉందో తెలుసా. ఈ రైల్వే స్టేషన్ ప్రపంచంలో అత్యధిక జనాభా కలిగిన చైనా, భారతదేశంలో లేదు. అయితే ఇది అమెరికాలోని న్యూయార్క్ నగరంలో ఉంది. ప్రపంచంలోనే అతి పెద్ద రైల్వే స్టేషన్ టైటిల్ గ్రాండ్ సెంట్రల్ టెర్మినల్ పేరుతో రిజిస్టర్ చేయబడింది. ఈ స్టేషన్ 1901 సంవత్సరం నుండి 1903 వరకూ మూడేళ్ల పాటు నిర్మించారు. స్టేషన్ నిర్మాణం వెనుక ఉన్న ఒక ఆసక్తికరమైన కథ ఏమిటంటే ఇది ఆ సమయంలో పెన్సిల్వేనియా, రైల్‌రోడ్ స్టేషన్‌తో పోటీపడేలా రూపొందించబడింది. ప్రజలకు తెలియని అతి పెద్ద రైల్వే స్టేషన్‌కు సంబంధించిన సమాచారం ఇక్కడ ఉంది. ఈ రైల్వే స్టేషన్‌ను భారీ యంత్రాలు లేని కాలంలో నిర్మించారు. దీన్ని నిర్మించడానికి ప్రతీ రోజూ 10 వేల మంది పనిచేశారు. స్టేషన్ దాని పరిమాణానికి మాత్రమే కాకుండా దాని నిర్మాణం, రూపకల్పనకు కూడా ప్రసిద్ధి చెందింది. ఈ స్టేషన్‌లో మొత్తం 44 ప్లాట్‌ఫారమ్‌లు ఉన్నాయి. ఇక్కడ ఏకకాలంలో 44 రైళ్లు వచ్చి వెళ్లడమే కాకుండా స్టేషన్‌లో ఆగుతాయి. గ్రాండ్ సెంట్రల్ టెర్మినల్‌లో చాలా సినిమాల షూటింగ్ కూడా జరుగుతుంటాయి. ప్రపంచ దేశాల తర్వాత భారత్ గురించి మాట్లాడుకుంటే, దేశంలోనే అతి పెద్ద రైల్వే జంక్షన్ టైటిల్‌ను ఉత్తరప్రదేశ్‌లోని మధుర రైల్వే స్టేషన్ నమోదు చేసింది. రైల్వే స్టేషన్ గుండా కనీసం 3 మార్గాలు ఉన్న ప్రదేశాలను జంక్షన్ అంటారు. ఈ విధంగా ఉత్తరప్రదేశ్‌లోని గోరఖ్‌పూర్ రైల్వే స్టేషన్ ప్రపంచంలోనే అత్యంత పొడవైన ప్లాట్‌ఫారమ్‌ను కలిగి ఉంది. ఇంతకు ముందు ఈ ఫీట్ ఖరగ్‌పూర్ స్టేషన్ పేరిట నమోదైంది.

## ఈ రాష్ట్రంలో ఇప్పటి వరకూ రైలు కూత వినపడ లేదు

దేశంలోని పలు రాష్ట్రాల్లో వందే భారత్, శతాబ్ది, రాజధాని వంటి రైళ్లు వందల కిలోమీటర్ల వేగంతో పరుగులు తీస్తున్నాయి. కానీ ఇప్పటికీ ఒక్క రైలు కానీ, రైల్వే స్టేషన్ కూడా లేని రాష్ట్రం ఒకటి ఉందంటే నమ్ముతారా? అదే ఈశాన్య రాష్ట్రం సిక్కిం. దేశంలో ప్రస్తుతం రైల్వేస్టేషన్ లేని రాష్ట్రం సిక్కిం మాత్రమే ఉంది. స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు పూర్తయినా సిక్కిం రాష్ట్రంలో ఇంకా ఏ రైల్వే వ్యవస్థతోనూ అనుసంధానం కాలేదు. సిక్కింకు ఇన్నాళ్లూ రైల్వే లైను లేకపోవడానికి ప్రధాన కారణం అక్కడి భౌగోళిక పరిస్థితులేనని చెప్పవచ్చు. ఈ రాష్ట్రంలోని ఇళ్లు చాలా వరకూ ఎత్తయిన పర్వతాలపై ఉంటాయి. గతంలో అందుబాటులో ఉన్న సాంకేతిక పరిజ్ఞానం అలాంటి క్లిష్టమైన చోట్ల రైల్వే లైను ఏర్పాటు చేయడానికి తోడ్పడ లేదు. 2008 సంవత్సరంలో రైల్వే శాఖ పశ్చిమ బెంగాల్‌ను సిక్కింతో కలిపేందుకు సివోక్ రాంగ్‌పో రైలు మార్గం నిర్మాణం దిశగా అడుగులు వేసింది. వన్యప్రాణులు సంచరించే అభయారణ్యాలు, కొండ చరియలు విరిగిపడే అవకాశం ఉన్న ప్రాంతాలు ఎక్కువగా ఉండటంతో ప్రాజెక్టుకు అనుమతులు రావడంలో జాప్యం జరిగింది. 2016లో ఈ అడ్డంకులు తొలగిపోవడంతో పనులు వేగవంతం అయ్యాయి. 2021 నాటికే ప్రాజెక్టు పూర్తవుతుందని అంచనా వేసినా కరోనా మహమ్మారి కారణంగా అది నెరవేరలేదు. ఇప్పటికీ నిర్మాణాలు జరుగుతూనే ఉన్నాయి. పశ్చిమ బెంగాల్ నుండి సిక్కిం కలిసేలా సివోక్ రాంగ్‌పో రైల్వే మార్గం నిర్మాణం పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. ఇర్కాన్ ఇంటర్నేషనల్ కంపెనీ ఈ నిర్మాణం పనులు చేపట్టింది. మహానంద అభయారణ్యం ప్రాంతం గుండా వెళ్లే ఈ మార్గంలోని రైల్వే లైనుకు అనుమతి కఠిన ఆంక్షలతో లభించింది. ట్రాక్‌పై రైళ్ల వేగపరిమితి, పట్టాలపై వన్యప్రాణుల సంచారం గురించి తెలిసేలా సెన్సర్ల అమరిక తదితర రక్షణచర్యలు తీసుకుంటూ పనులు చేయాల్సి ఉంటుంది. ప్రస్తుతం సిక్కింలో రవాణా మొత్తం రోడ్డు మార్గం గుండానే సాగుతుంది. ఎన్‌హెచ్ 10 జాతీయ రహదారి ద్వారా ఇతర రాష్ట్రాల వాహనాలు సరిహద్దులు దాటుతుంటాయి. ఆరు లక్షలకు పైగా జనాభా కలిగిన ఈ రాష్ట్రంలో ఎవరైనా రైలు ఎక్కాలంటే మాత్రం పొరుగున ఉన్న పశ్చిమ బెంగాల్‌కు వెళ్లాల్సి ఉంటుంది. అక్కడి సిలిగుడి, జల్పాయ్‌గుడి రైల్వే స్టేషన్ల నుండి దేశంలోని ఇతర ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తుంటారు.

**- సిహెచ్.వి.వి.రఘుబాబు**



కథ

# పశ్చాత్తాపం

**ఒక** గ్రామంలో శరభయ్య అనే యజమాని ఉండేవాడు. అతనికి జంతువులు అంటే చాలా ప్రేమ. అతడు ఒక కుక్కను, ఒక పిల్లిని పెంచుకుంటూ ఉండేవాడు.

ఒకనాడు అతని ఇంటి వద్దకు ఒక కోతి వచ్చింది. అది వచ్చీ రావడంతోనే కుక్క, పిల్లితో "మిత్రులారా! మనమంతా ఒకటే. మేం అడవిలో నివసిస్తే మీరు పెంపుడు జంతువులై ఇళ్లలో నివసిస్తున్నారు. అంతే తేడా" అని అంది.

దాని తీయని మాటలకు కుక్క, పిల్లి తలొగ్గాయి. అది వాటితో స్నేహం చేసి ప్రతిరోజు వచ్చి మామిడి చెట్టును ఎక్కి మామిడి పండ్లను తెంపుకొని తినేది. తమ యజమానికి తెలియకుండా పండ్లు తెంపవద్దని కుక్క, పిల్లి ఎంత ప్రాధేయపడినా వినలేదు.



అలా ఆ కోతి ప్రతిరోజు వచ్చి ఆ మామిడి పండ్లను తెంపి తిని వాటి టెంకలను అతని ఇంటిపైన వేయసాగింది. అది అలా ఆ మామిడి టెంకలను విసిరివేయడంతో శరభయ్య ఇంటిపై వున్న పెంకులు పగిలిపోయాయి. ఆ తర్వాత ఆ మామిడి టెంకలు ఆ ఇంటిపై నుండి దొర్లి పిల్లి ఉన్న ప్రాంతంలో పడ్డాయి. ఆ సమయంలో కుక్క కూడా అక్కడ లేదు.

ఆ చప్పుడుకు లోపల ఉన్న శరభయ్య బయటకు వచ్చేసరికి కోతి పారిపోయింది.

శరభయ్య ఇది పిల్లి చేసిన పనే అనుకొని ఆ పిల్లిని కర్రతో బాదాడు. ఆ పిల్లి ఇది తన పని కాదని ఎంత మొత్తుకున్నా అతడు పట్టించుకోలేదు.

మరొకసారి పిల్లి లేనప్పుడు ఆ కోతి తిరిగివచ్చి ఆ మామిడి పండ్లను తిని, వాటి టెంకలను శరభయ్య ఇంటిపై పడవేయసాగింది. మామిడి టెంకలు జారుకుంటూ కుక్క వద్దకు వచ్చి పడ్డాయి.

అప్పుడు శరభయ్య బయటకు వచ్చి చూసి, అది కుక్క పనే అనుకొని దాన్ని కూడా ఒక కర్రతో కొట్టాడు. "నేను ఆ పండ్లు తినలేదు మహాప్రభో" అని కుక్క ఎంత మొత్తుకున్నా అతడు పట్టించుకోలేదు.

ఒకరోజు ఆ కోతి తిరిగి వచ్చి ఆ చెట్టుని ఎక్కగానే యజమాని తమను కొడతాడన్న భయానికి ఆ కుక్క, పిల్లి రెండూ అక్కడి నుండి జారుకున్నాయి.

అప్పుడే బయటకు వచ్చిన శరభయ్య మామిడిచెట్టు పైన ఉన్న కోతిని చూసి "ఓహో! ఇది నా చెట్టు పండ్లన్నీ నన్ను అడగకుండా దొంగతనంగా తినడమే కాకుండా నా ఇంటి పెంకులను పగలగొడుతున్నదన్న మాట" అని అనుకొని దానిపైకి ఒక కర్రను విసిరాడు. ఆ కర్ర కోతివీపుకు తాకి అది 'కుయ్యో.. మొర్రో' అనుకుంటూ పారిపోయింది.

ఆ తర్వాత అతడు తన పెంపుడు జంతువులు కొరకు చూశాడు. అవి అక్కడ లేవు. "అయ్యో! ఇన్ని రోజులు ఆ పండ్లను తింటున్నది కోతి అని నేను నిజం తెలుసుకోకుండా తొందరపడి పెంపుడు జంతువులను కొట్టానే!" అని పశ్చాత్తాప పడ్డాడు. తర్వాత వాటి కొరకు వీధిలోకి బయలుదేరాడు. ఇంతలో కుక్క, పిల్లి రెండూ రావడం చూశాడు. వెంటనే శరభయ్య వాటిని దగ్గరకు తీసుకొని ప్రేమతో నిమిరాడు.

కుక్క, పిల్లి ఇతర పెంపుడు జంతువులకు కూడా ఈ కోతి చేసిన అపకారం గురించి తెలియజేసాయి. ఆ కోతి ఎక్కడికి వెళ్లినా మిగతా పెంపుడు జంతువులు దాన్ని రానివ్వకుండా అడ్డుకున్నాయి. చివరకు ఇతరులకు అపకారం చేసిన కోతి తాను చేసిన పనికి నొచ్చుకుంటూ పశ్చాత్తాపంతో ఆహారం లేక అక్కడి నుండి అడవి బాట పట్టింది.

**- సంగనభట్ల చిన్న రామకిష్టయ్య**

# రంగుల హరివిల్లు

వార్త ఆదివారం

## బాలగేయం

### ఎలా వచ్చింది?



వెన్నముద్ద! వెన్నముద్ద!
మెత్తదనమెలా వచ్చింది?
అమ్మ గోరుముద్దలోంచి
ఇలా పురుడు పోసుకుంది.
కోకిలమ్మ! కోకిలమ్మ!
కమ్మదనమెలా వచ్చింది?
అమ్మ జోలపాటలోంచి
పొంగిపొర్లి వచ్చింది.
వెన్నెలమ్మ! వెన్నెలమ్మ!
చల్లదనమెలా వచ్చింది?
అమ్మ ప్రేమ ఊటలోంచి
ఉద్భవించి వచ్చింది.
మల్లెపూవు! మల్లెపూవు!
తెల్లదనమెలా వచ్చింది?
తల్లి
హృదయపుటంచులోంచి
మెల్ల మెల్లగా వచ్చింది.

**- గద్వాల సోమన్న,**
ఎమ్మిగనూరు

## హలో ఫ్రెండ్...

**చిన్నారుల ప్రశ్నలకు**

వార్త సిఎండి, మేనేజింగ్ ఎడిటర్

**గిరీష్ అంకుల్ సమాధానాలు**

**- కె.లావణ్య,** గుంటూరు

**ప్రశ్న: గిరీష్ సంఘీ అంకుల్ గారికి నమస్తే. సూర్యకాంతిలో ఏయేరంగులు వుంటాయి?**

**జవాబు: లావణ్య!** సూర్యగ్రహం నుంచి వెలువడే తెల్లటి కాంతిలో ఎరుపు, పసుపు, నారింజ, ఊదా, నీలి(ఇండిగో), ఆకుపచ్చ, నీలం రంగులు మిళితమై ఉంటాయి. తరంగాల రూపంలో ఉండే ఈ వివిధ రంగుల కాంతి కిరణాల తరంగ దైర్ఘ్యాలు మాత్రం భిన్నంగా ఉంటాయి. కాంతికిరణాలు తరంగాల రూపంలో ఉండటంతో వేవ్ లెంగ్త్ (తరంగ దైర్ఘ్యం) ఉంటుంది.

**- బి.మోహన్,** మహబూబ్‌నగర్

**ప్రశ్న: గిరీష్ సంఘీ అంకుల్ గారికి నమస్తే. ఆపిల్‌పండును కోసి వుంచితే, కోసిన లోపలి వైపున కొద్దిసేపటికే రంగు మారిపోతుంది. కారణం ఏంటి?**

**జవాబు: మోహన్!** ఆపిల్ పండులో ఐరన్(ఫెర్రస్) వంతు అధికంగా ఉంటుంది. పండు కోసిన తర్వాత ఆ ముక్క వైపు భాగం వాతావరణంలోని ఆక్సిజన్ వాయువుతో ఆక్సీకరణం చర్య జరుపుతుంది. ఈ కారణంతో ఉపరితలం మీద ఫెర్రస్ ఆక్సైడ్ పొర తరహాలో పొర ఏర్పడుతుంది.

**- ఎస్.ప్రసాదిని,** విజయవాడ

**ప్రశ్న: గిరీష్ సంఘీ అంకుల్ గారికి నమస్తే. కొన్నిప్రాంతాల ప్రజలు పసిమిఛాయతో మిలమిలలాడుతుంటారు. ఎందువల్ల?**

**జవాబు: ప్రసాదిని!** చర్మపు రంగును నిర్దేశించే మరో పదార్థం 'కెరోటిన్' కూడా మన శరీరంలో ఉంటుంది. ఇది పసుపుపచ్చగా ఉంటుంది. (మెలానిన్ గోధుమ రంగులో ఉంటుంది). కెరోటిన్ వలన ఆగ్నేయాసియా, జపాన్, చైనా, మన కాశ్మీర్, ఉత్తర భారతదేశం ప్రజలలో అత్యధిక శాతం మంది పసిమి ఛాయతో ఉంటారు. వీరు నివసించే ప్రాంతపు శీతోష్ణస్థితి కూడా మరో ప్రధాన కారణం.

# వేసవి తాపాన్ని తీర్చే 'కర్బూజా'



**మండు** వేసవిలో దాహార్తిని దూరం చేసే నేస్తం కర్బూజ. పోషక విలువలు ఎన్నో ఉన్న ఈ సీజన్ ఫ్రూట్‌ను వేసవిలో పండ్లు, జ్యూస్‌ల రూపంలో తీసుకుంటే వేసవి ఎండలకు శరీరం డీ హైడ్రేట్ కాకుండా రక్షించుకోవచ్చు.
వేసవి దాహార్తిని తీర్చే వాటిలో కర్బూజ ముఖ్యమైనదని చెప్పవచ్చు. కర్బూజ పండ్లు ఆకుపచ్చ, పసుపు రంగుల్లో లభిస్తాయి. చలువ చేసే పుచ్చకాయ ఇటీవలి కాలంలో ఏడాదంతా లభిస్తోంది. కానీ కర్బూజ మాత్రం వేసవిలోనే లభిస్తుంది. వాసనతోనే అది కర్బూజ పండా, కాయా అని తెలుసుకోవచ్చు. మెలన్ కుటుంబానికి చెందిన ఈ మస్క్ మెలన్‌ను స్వీట్ మెలన్ అని కూడా అంటారు. దీనికి కారణం ఈ పండులోని తీపిదనమే అని చెప్పవచ్చు.

**ఎన్నో రకాలు!**

అతి ప్రాచీనమైన పండ్లలో కర్బూజ ఒకటి. ఈ పండు స్వస్థలం గురించి ప్రపంచ వ్యాప్తంగా ఇంకా తర్జన భర్జనలు జరుగుతూనే ఉన్నాయి. కొందరు ఆఫ్రికా అని, మరికొందరు పర్షియా వీటి పుట్టినిల్లు అంటుంటారు. అయితే ఇప్పుడు అత్యధికంగా పండిస్తున్న దేశాలుగా చైనా, టర్కీ, అమెరికా రికార్డులకెక్కాయి. మొత్తంగా యాభై రెండు శాతం ప్రపంచ కర్బూజ ఉత్పత్తి ఒక్క చైనాలోనే జరుగుతోంది. సుమారు 1200 రకాల కర్బూజ పండ్లు అంతటా ఉత్పత్తి అవుతున్నాయి. మన దేశంలో పంజాబ్, తమిళనాడు, ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు కర్బూజ ఉత్పత్తిలో ముందున్నాయి. ఈ పళ్ల సీజన్ అంటే ఏప్రిల్ నుంచి జులై వరకు లభిస్తాయి.

**కర్బూజను కొనేటప్పుడు పాటించాల్సిన మెలకువలు:**

➡ కర్బూజ పండును పట్టుకుని దానిపై చేత్తో తడితే లోపల కాస్త డొల్లగా వినిపించాలి. శబ్దం గట్టిగా వస్తే పండు ఇంకా పక్వం చెందలేదని అర్థం.



➡ కట్ చేయని కర్బూజ పండ్లని గది ఉష్ణోగ్రత దగ్గర స్టోర్ చేయవచ్చు. ఒకసారి ముక్కలుగా కోస్తే మాత్రం ఫ్రిజ్‌లో పెట్టాల్సిందే. అదే గాలి దూరని డబ్బాలో గట్టిగా మూత మూసి ఫ్రిజ్‌లో పెడితే అయిదు రోజుల వరకూ ముక్కలు చెడిపోవు.

➡ రంగును బట్టి కర్బూజ రుచి చెప్పొచ్చు. గట్టిగా ఉండేవి, బాగా పసుపుపచ్చగా ఉండేవాటి కన్నా పక్వానికి వచ్చిన రంగు ఇట్టే తెలిసిపోతుంది. అలాంటి పండ్లు తియ్యదనంతో రుచిగా ఉంటాయి.

➡ కేవలం కర్బూజ పండుగానే కాదు, పిల్లలకు ఇష్టమైన ప్యూరీలు, స్మూతీలు చేసుకోవచ్చు.

➡ వేసవి తాపానికి ఉపశమనంగా మెలన్ ముక్కలతో ఇన్‌ఫ్యూజ్డ్ వాటర్ చేసుకుని తాగవచ్చు. ఫ్రీజర్‌లో గడ్డకట్టిన కర్బూజా ముక్కల్ని అవసరమైనప్పుడు నిమ్మరసంలో వేసుకుని జ్యూస్‌లా తాగితే రిఫ్రెషింగ్‌గా ఉంటుంది.

**మెలోనా రకం**

దక్షిణ కొరియాలో అత్యంత పాపులర్ ఐస్‌క్రీమ్ మెలోనా. దీనిని 1992లో అక్కడి మార్కెట్‌లోకి విడుదల చేశారు. 1994లో విశేషంగా 28 కోట్ల మెలోనా ఐస్‌క్రీమ్‌బార్లను అమ్మారు. అప్పటి నుంచి ఈ ఐస్‌క్రీమ్ టాప్‌గా నిలిచింది. ఆ తరువాత అమెరికా, అక్కడి నుంచి మిగతా దేశాలన్నిటికీ పాకింది. కర్బూజా ఫ్లేవర్‌తో ఉండే ఈ ఐస్‌క్రీమ్ పుల్లను నోట్లో వేసుకోగానే కరిగిపోతుంది. అంతేకాదు, తక్కువ క్యాలరీలతో అందరినీ ఆకట్టుకుంటోంది. తాజా పండ్ల రుచిని సొంతం చేస ఈ ఐస్‌క్రీమ్ రుచి అందువల్లే హిట్ అయింది.



**అతి ఖరీదైనది**

దేశ, విదేశాల్లో కర్బూజలో ఎన్నో రకాలు లభిస్తున్నాయి. జపాన్‌లో మాత్రమే కనిపించే 'యుబారి కింగ్' మెలన్ ధర అత్యంత ఖరీదైనదని అంటారు. ఒక కిలో యుబారి కింగ్ మెలన్ ధర రూ.20 లక్షలు. జపాన్‌లోని ధనికులకు ఈ పండంటే మహా క్రేజ్. యుబారి అనే ప్రాంతంలో మాత్రమే ఒపడుతాయి. ఈ పండును స్టేటస్ సింబల్‌గా భావిస్తారు. గ్రీన్ హౌజుల్లో ప్రత్యేకంగా వీటిని పండిస్తారు. విత్తనాల ఎంపిక నుంచి పండించడం వరకు అంతా ప్రత్యేక శ్రద్ధతో చేస్తారు. యుబారి మెలన్ పంట చేతికి



రావాలంటే వంద రోజుల సమయం పడుతుంది. ప్రతిరోజూ రైతు ఆ పండును పర్యవేక్షిస్తూ పెంచుతాడు. రుచి చాలా అద్భుతంగా ఉంటుంది. ప్రతి యుబారి పండుకు జియోగ్రాఫికల్ ఇండెక్స్ ఉంటుంది. అందుకే అంత ఖరీదు. ఎక్కువగా బహుమతులు అందించే జపానీయులు సంస్కృతిలో సంపన్నుల మొదటి ఛాయిస్ యుబారి.

ఆరోగ్య ప్రదాయిని

కర్బూజ పండు వల్ల కలిగే ప్రయోజనాలు అనేకం.

**జీర్ణవ్యవస్థకు:** కర్బూజలో పీచు పదార్థాలు, నీళ్ల శాతం ఎక్కువ. అందుకే అజీర్ణం, జీర్ణకోశ సంబంధ సమస్యలతో బాధపడుతున్న వారికి సహజమైన ఔషధంగా ఉపయోగపడుతుంది. అంతేకాకుండా ఎక్కువ మొత్తంలో విటమిన్ సి ఉండడం వల్ల కడుపులోని అల్సర్లను తగ్గించడంలో సహాయకారిగా ఉపయోగపడుతుంది.

బీపీ ఎక్కువగా ఉన్నవాళ్లు ఎండాకాలంలో రోజువారీ ఆహారంలో కర్బూజను తీసుకోవడం మంచిది. ఇందులో అధికంగా పొటాషియం ఉండడం వల్ల రక్తనాళాలను సడలించి రక్తం సులభంగా సరఫరా అయ్యేలా చేస్తుంది. ఈ పండు గ్లైసమిక్ ఇండెక్స్ తక్కువ కాబట్టి షుగర్ పేషెంట్లు దీనిని తిన్నా చక్కెర స్థాయిలు పెరగవు.



**కేశాలు పెరుగుతాయి:** తలలో వెంట్రుకలు పలచబడుతున్నాయని ఆందోళన చెందేవారు కర్బూజను ఎక్కువగా తినండి. కొద్ది రోజుల్లో మార్పు తెలుస్తుంది. ఈ పండులో విటమిన్ ఎ ఎక్కువగా ఉండడమే దీనికి కారణం. అలాగే ఇందులో సిట్రులిన్ అనే అమైనో ఆసిడ్ ఎక్కువగా ఉంటుంది. దీని వల్ల రక్తప్రసరణ ముఖ్యంగా తలపై మాడులో రక్తప్రసరణ బాగా జరిగేలా చేస్తుంది. కర్బూజలోని ఇనోసిటాల్ అనే మినరల్ వెంట్రుకలు రాలిపోవడానికి నివారిస్తుంది. ఈ పండ్ల గుజ్జును తలకి పట్టించడం వల్ల మంచి ఫలితాలు లభిస్తాయి.

**కంటిచూపు పెరుగుతుంది:** బీటాకెరోటిన్, గ్జియాంథిన్, ల్యుటీన్ అనే మూడు యాంటీ ఆక్సిడెంట్లు స్వీట్ మెలన్‌లో ఉండడం వల్ల కంటికి శ్రీరామరక్షగా కర్బూజను పేర్కొంటారు. ఏ వయసు వారైనా ఈ పండును తీసుకోవడం వల్ల కంటిచూపును రక్షించుకోవచ్చు.

**రోగనిరోధక శక్తి పెరుగుతుంది:** విటమిన్ సి ఈ పండులో ఎక్కువ. అందుకే రోగ నిరోధక శక్తిని పెంచడానికి తోడ్పడుతుంది. విటమిన్ సి వల్ల తెల్ల రక్తకనాల సంఖ్య పెరుగుతుంది. ఈ కణాలు వైరస్‌లు, బ్యాక్టీరియా మొదలైన మైక్రో ఆర్గానిజమ్స్ నుంచి శరీరాన్ని రక్షిస్తాయి. కర్బూజలోని యాంటీ ఆక్సిడెంట్లు చర్మంలోని మలినాలను తొలగించడానికి దోహదపడతాయి. చర్మానికి రక్షణ కలిగించే కొల్లాజన్ అనే ప్రొటీన్ ఈ పండులో ఎక్కువగా ఉంటుంది. చర్మ సహజ మెరుపును కాపాడుతుంది, చర్మం తొందరగా ముడతలు రాకుండా సహాయపడుతుంది. ఫేస్‌పేస్టుగా కూడా దీని గుజ్జును ఉపయోగించవచ్చు.



**ఒత్తిడిని నివారిస్తుంది:** ఈ పండ్లలో పొటాషియం అధికంగా ఉండడం వల్ల కర్బూజను తినడం వల్ల ఒత్తిడి, ఆందోళన తగ్గుతాయని పరిశోధనల్లో తేలింది. గుండె దడను సాధారణపరచి, మెదడుకు చక్కగా ఆక్సిజన్‌ను అందించడంలో దోహదపడుతుంది. కాళ్లనొప్పులు ఉన్నవారికి కర్బూజ చక్కటి ఉపశమనం కలిగిస్తుంది. కీళ్లనొప్పులను సైతం నివారిస్తుంది. ఎముకలకు సంబంధించిన వ్యాధి ఆస్టియోపోరోసిస్ నివారణకు కూడా సహాయపడుతుంది. పంటి వ్యాధులు ఉన్నవాళ్లు తక్షణ నివారణ కోసం కర్బూజను తీసుకోవచ్చు.




శ్వాస కోశ వ్యాధులతో బాధపడుతున్న పిల్లలు, పెద్దవారు కర్బూజ పండును ఉపశమనం లభిస్తుంది. కర్బూజలోని విటమిన్ ఎ ఊపిరితిత్తుల సామర్థ్యాన్ని పెంచుతుంది. ❑

కథ

# జీవన ప్రస్థానం

షేక్ మహబూబ్ జాన్

**అది అందమైన ఓంకారమై ప్రతిధ్వనించు ఒంగోలు నగరం. ఆ నగరానికి ఉత్తరాన నేషనల్ కంపెనీ. ఆ కంపెనీ పొగాకు సీజన్‌లో కార్మికులతో సంతను తలపిస్తుంది. గంట గంటకు గణగణమని మోగే గంటతో ఆ ప్రాంతమంతా ప్రతిధ్వనిస్తుంది.**

**ఆ నేషనల్ కంపెనీకి ఎదురుగా పూర్వ కాలంలో రాజులు ఏలిన కోటవీధి. ఆ వీధికి ముఖద్వారంలో కొంతమంది ముస్లిం కుటుంబాలు నివసిస్తున్నాయి.**

అందులో ఒకటి ఖాసిం సాహెబ్ పెంకుటిల్లు.

ఖాసింసాహెబ్ పెద్దవాడయ్యాడు. మధుమేహంతో బాధపడుతూ మంచానికే పరిమితమయ్యాడు. ఆ కుటుంబంలో ఆయన భార్య ఖాసింబీ, కుమారుడు రహమతుల్లా, కోడలు, పదకొండు సంవత్సరాల కూతురు అజీమా బేగం.

ఆ రోజు సాయంత్రం కావొచ్చింది. సూర్యుడు అలసిపోయి, చమట కక్కుకుంటూ ఎర్రని మొఖమేసుకొని పడమటి కొండలలో తలదాచుకొనుటకు సమాయత్తమౌతున్నాడు.

పక్షులు పగలంతా ఆహారాన్వేషణలో తమ అన్వేషణ సాగించి, తమ తమ గూళ్లకు చేరుకోవటానికి గూళ్లకు దగ్గర దగ్గరగా వచ్చి సేదతీరుతున్నాయి.

అప్పుడే నేషనల్ కంపెనీ గణగణమని గంట మోగింది. స్త్రీ కార్మికులు బిలబిల మంటూ బయటకు వచ్చి తమ తమ ఇళ్లకు వెళ్లుటకు బారులు తీరుతున్నారు.

భార్య ఖాసింబీ ఏదో పనిమీద పక్క ఇంటికి పోయింది. కొడుకు, కోడలు తమ తమ పనులలో నిమగ్నమై వున్నారు. లోకంలో అంధకారం ఆవరిస్తుంది. చీకటి వెలుగును కౌగిలించుకుంటుంది.

ఇంకా యిళ్లలో దీపాలు వెలగలేదు. అంతా నిశ్శబ్దం, ఏదో జరగబోతున్నట్లు ఆ ఇల్లు మౌనంగా చూస్తుంది.

అంతలో "అమ్మీ... అమ్మీ" అని ఒక గొంతు వినిపించింది.

ఆ గొంతు వినగానే బాలిక అజీమా బేగం "అబ్బా.. అబ్బా" అంటూ తండ్రి దగ్గరకు వచ్చింది.



"అమ్మీ! కొద్దిగా నీళ్ల యివ్వు" అన్నాడు ఖాసిం సాహెబ్ గద్గద స్వరంతో.

బాలిక తండ్రి వంక చూసింది. ఏదో జరగబోతుందని అనుమానం కలిగింది ఆ బాలికకు.

పరుగెత్తుకుంటూ పోయి గ్లాసుతో మంచినీళ్లు తెచ్చి తండ్రి ఖాసిం సాహెబ్‌కు తాగించింది.

ఖాసిం సాహెబ్ నీళ్లు తాగి "అమ్మా! దగ్గరకు రా, నా దగ్గర కూచో" అంటూ ఆ బాలికను దగ్గరకు తీసుకొని తల నిమరసాగాడు.

దీనస్వరంతో "అమ్మా, నేను అల్లా దగ్గరకు పోతున్నాను. నిన్ను విడిచి వెళ్తున్నానమ్మా. అమ్మీ, నీవు చిన్నదానివి. నీవు ఎట్లా బతుకుతావోనని నాకు బాధగా వుంది. నీకు ఈ లోకంలో కష్టాలు తప్పవు" అంటూ గద్గద స్వరంతో అన్నాడు.

ఖాసిం సాహెబ్ మాటలకు బాలిక కళ్లవెంట కన్నీళ్లు ధారాపాతంగా కారసాగాయి.

ఖాసిం కళ్ల వెంట కూడా కన్నీళ్లు కారి గడ్డంలో కలిసిపోతున్నాయి.

"అబ్బా, ఏడ్వబాకు. నీకు ఏం కాదు" అంటూ తండ్రి కన్నీళ్లు తుడవసాగింది.

ఖాసిం సాహెబ్ మళ్లీ "అమ్మీ, నీకు అంతా శుభమే జరుగుతుంది. నేను లేనని భయపడకు, ధైర్యంగా ముందుకు నడువు" అంటే అజీమా బేగం వైపు చూసాడు.

ఆ బాలిక వెక్కి వెక్కి ఏడుస్తోంది. నిస్సహాయ స్థితిలో వుంది, కళ్ల వెంట కన్నీళ్లు ప్రవహించసాగాయి.

ఒకసారి లేని బలం తెచ్చుకొని కన్నీళ్లు తుడవడానికి ముందుకు కదిలి చేయి ఎత్తాడు. ఎత్తిన చేయి ఎత్తినట్లే పక్క మీద వాలిపోయాడు.

"అబ్బా...అబ్బా" అంటూ ఏడుస్తూ యింట్లో చెప్పడానికి యింట్లోకి పరుగెత్తింది.

అందరు వచ్చారు.

ఖాసిం సాహెబ్ ప్రాణం ఆ సంధ్యచీకట్లో అనంతవాయువులో కలిసిపోయింది.

కుటుంబసభ్యులు గొల్లుమన్నారు.

ఒక పక్షి లోకం విడిచి ఎగిరిపోయింది.

తండ్రి చనిపోయిన తరువాత తండ్రి జ్ఞాపకాలతో, అభద్రతా భావంతో అన్న, వదినల పర్యవేక్షణలో భారంగా కాలం గడపసాగింది. 12వ సంవత్సర ప్రాయంలో పెద్దమనిషి అయింది. అప్పటికే ఉర్దూ పాఠశాలలో 5వ తరగతి చదివి, ఉర్దూ, ఖురాన్ పఠనంలో తర్ఫీదు పొంది వున్నది.

**అజీమాబేగం అయిదు పూటలా అల్లాను తలంచి ప్రార్థిస్తూ నమాజు చేసేది. అల్లానే రక్షకుడిగా తనను దరికి చేర్చేవాడిగా భావించి అల్లాపై భారం వేసి నమాజులో మునిగిపోసాగింది.**

ఖాసింబీ, కూతురు అజీమా బేగం పెళ్లి చేయాలని సంకల్పించింది ఆ చిరుప్రాయంలో. సినిమాహాళ్ల గేటు దగ్గర సినిమా టిక్కెట్లు చించేవారిని, కూలిపనులు చేసేవారిని, భార్య చనిపోయి రెండవ పెళ్లికి సిద్ధమైనవారి సంబంధాలు చూడసాగింది. కానీ అన్న రహమతుల్లా వాటినన్నింటినీ తిరస్కరించి చెల్లెలు అజీమా బేగంకు అండగా నిలిచాడు.

దేవుడు మేలు చేయదలచితే తానే స్వయంగా దిగి వచ్చి అనాథలను, ఆర్తులను ఆదరించి అక్కున చేర్చు కుంటాడనేదానికి నిదర్శనంగా ఒక రిటైర్డ్ మిలటరీ కుటుంబాన్ని యింటి పక్క పోర్షనులో అద్దెకు దించాడు.

వారు అమ్మాయి స్థితిగతులకు ప్రభావితులై రేపల్లె దగ్గర కనగాలలో 8వ తరగతికి మంచి శిక్షణ ఇస్తున్నారు. దాని తరువాత ఉర్దూ ట్రైనింగ్ చేయవచ్చని గట్టిగా ప్రోద్బలం యిచ్చారు.

ఆ మాటలు విని అజీమాబేగం ఎగిరి గంతేసింది.

అన్న రహమతుల్లా కూడా చదివించడానికి అంగీకరించాడు.

చిన్ననాడు తాను చదివిన పద్యం–

"తివిరి యిసుమున తైలంబు తీయవచ్చు

తిరిగి కుందేటి కొమ్ము సాధించవచ్చు"

అనే పద్యమును స్ఫూర్తిగా తీసుకొని పేదరికంతో సహవాసం సాగిస్తున్న ఆ మధ్య తరగతి కుటుంబం చదువు ఖర్చులకుగాను బంగారు నాగరం అమ్మి ఒక సుముహూర్తాన, అమ్మ ఖాసింబీతో కలిసి అజీమాబేగం చదువుల మధువనిలో ఆమనియై విరబూయుటకై బయలుదేరింది.

తన యింట్లోని పెరటి జామచెట్టు తియ్యని జామకాయలు యిచ్చి ఆదరించిన ఆ జామచెట్టు చల్లని గాలికి చిరు మందహాసం చేస్తూ సకల కోరికలు ప్రాప్తిరస్తు అంటూ ఆశీర్వదించినట్లు చెట్టు తల వైపి వీడ్కోలు పలికింది.

తాను రోజూ ఊగే ఉయ్యాల, గాలికి ఊగుతూ విద్యా సరస్వతియై తిరిగి రావాలని మౌనంగా ఆశీర్వదించింది. బాలిక అజీమాబేగం, చదువు అభ్యసించే ఆనందంలో కొత్త దారిలో పూలను పరచుకొని నవ పథంలో పయనించాలని అభిలాషతో అమ్మ ఖాసింబీతో కలిసి కనగాలకు వెళ్లిపోయింది. అదే ఆమె ప్రగతికి తొలి మెట్టై నిలిచిపోయింది.

కనగాల గ్రామం పచ్చని పైర్లతో అలరారే సుందర గ్రామం. గ్రామం చుట్టుపక్కల వరిచేలతో పచ్చగా విలసిల్లుతుంది. పొలాల గట్ల మీద ఆకాశాన్ని అందుకొనుటకు ప్రయత్నిస్తున్న తాటిచెట్ల విజయ దరహాసం.

కనగాల చేరిన తరువాత బాలిక అజీమా బేగం చదువుల పోరాటంలో పగలూ రాత్రి ఒకటి చేసింది. నిద్రాహారాలు పరిమితం చేసుకుంది. అజీమాబేగం చదువుల స్వరం విని కోడి నిద్ర లేచి హడావుడిగా కూస్తుంది.

ఎంతో కష్టపడి అక్కడి విద్యార్థులకు అసూయ కలిగేలా అన్ని సబ్జెక్టులలో మంచి మార్కు సంపాదించి, మిగతా పిల్లల తల్లిదండ్రులకు ఆమె ఆదర్శంగా నిలిచింది.

తన శ్రమ ఫలితంగా ఎన్నో కష్టాలు అనుభవించి అమ్మ ఖాసింబీ సహాయంతో చక్కగా చదివి 8వ తరగతి మొదటి తరగతిలో ఉత్తీర్ణురాలై గుబాళించే చదువుల పట్టా పొంది ఒంగోలు నగరానికి చేరింది.

విజయ దరహాసంతో ఒంగోలు నగరానికి చేరిన చదువుల సరస్వతి అజీమాబేగం, ఉపాధ్యాయ శిక్షణకై గుంటూరు నగరానికి చేరి, రెండు సంవత్సరాలు అక్కడ పరిస్థితులతో పోరాడి ఉపాధ్యాయ ట్రైనింగ్ పాసై, యింటికి చేరింది.

ఆ రోజుల్లో ఆడవాళ్లు చదవడం చాలా అరుదు. అక్కడక్కడ కొంతమంది బాలికలు చదువుల దారిపట్టి తమ మార్గాన్ని తామే నిర్ధారించుకునేవాళ్లు. కానీ ముస్లిం సమాజం పిల్లలను చదువులకు దూరంచేసి తమ సంప్రదాయ కబంధ హస్తాలలో బంధించేవారు. అటువంటి సమయంలో తనకు చదువుపై గల ఆసక్తితో, అన్న ప్రోద్బలంతో సంప్రదాయాలను పటాపంచలు చేసి, బంధనాల పంజరాన్ని తెంచుకొని విద్యాగగనంలో స్వేచ్ఛగా విహరించి చదువుల సారాన్ని గ్రహించి కొత్త ఒరవడికి ప్రతీకగా నిలిచి, కొత్త తరానికి ఒక ఆదర్శంగా నిలిచింది అజీమా బేగం.

ఉపాధ్యాయురాలిగా ట్రైనింగ్ పట్టా పొందిన తరువాత మూడు వసంతాలు తమ వసంత సోయగాలతో జనులను మురిపించి వెళ్లిపోయింది.

ఒక మంచి ముహూర్తంలో తాను ఏ పాఠశాలలో చదివిందో అదే పాఠశాలలో ఉర్దూ ఉపాధ్యాయినిగా చేరింది విజయగర్వంతో.

కాలం ఆగదు.. అది ప్రవాహమై ముందుకు పరవళ్లు తొక్కుతూ ప్రవహించసాగింది. మల్లెలు చూస్తే మనసు ఆనంద తాండవం చేసేది. వసంతశోభిలలో చిగురించి చెట్లను చూసి, పూసిన సుందర విరులను చూసి, కోకిల కుహూ.. కుహూ గానాలు విని ఆకాశంలో మెరిసే మెరుపులు, జల్లులు.. జల్లులుగా కురిసే వానచినుకులు చూసి తనకు తెలియని ఒక మహా అనుభూతికి గురైంది ఆ ఉపాధ్యాయురాలు.

తాను కూడా పెళ్లి చేసుకొని ఒక చక్కని సంసార బంధంలో బంధించబడి సుఖజీవనం గడపాలనే కోరిక క్రమక్రమంగా కలగసాగింది. కానీ అన్న తన సంపాదనతో ఆనందంలో విహరిస్తూ, చెల్లికి పెళ్లి చేయాలనే మాటే మరచి, పెళ్లి సంబంధాలను తిప్పి పంపసాగాడు.

అజీమాబేగం అయిదు పూటలా అల్లాను తలంచి ప్రార్థిస్తూ నమాజు చేసేది. అల్లానే రక్షకుడిగా తనను దరికి చేర్చేవాడిగా భావించి అల్లాపై భారం వేసి నమాజులో మునిగిపోసాగింది.

అల్లా ఆమె వేదనాభరిత విజ్ఞప్తిని ఆలకించాడు. తానున్నానని ఆర్తులను, అనాథలను తనను ఆరాధించేవారిని తనతో మమేకమై వారి కోసం మరలా ఒకసారి భువికి దిగి వచ్చాడు.

ఆమె చదువుకొనుటకు తాను ఎవరిని పంపాడో అదే దారిలో తన యింటి పక్క పోర్షన్‌లో ఒక మంచి కుటుంబాన్ని దించాడు.

కాలక్రమంలో అనేక యిబ్బందులతో పోరాడి అంతవరకు తనను మిక్కిలి ప్రేమించి పెంచి, పోషించిన అన్న చివరకు రుక్మి అయి శిశుపాలుడు లాంటి తన బావమరిదితో వివాహానికి పూనుకుంటే– అజీమాబేగం ధైర్యం చేసి "నేను అనుకున్న సంబంధాన్ని కాదంటే పాఠశాలలో బావిలో పడి మరణిస్తానని" హెచ్చరించి పాఠశాలకు వెళ్లిపోయింది. గత్యంతరం లేని పరిస్థితులలో తాను కోరుకున్న హిందీ ఉపాధ్యాయుణ్ణి పెళ్లి చేసుకుంది.

ఏడు అడుగులు నడచి ఒక్కటైన అడుగుల ఛాయలు మాయలేదు. కాళ్ల పారాణి ఆరలేదు, సంసార బంధంలో వేసిన మల్లెపూలు దండల వసి వాడలేదు, తనకు యిష్టంలేని వివాహం చేసుకుందని భావించిన అన్న ఆమెను సామానులతో సహా బయటకు నెట్టేశాడు.

అయినా ఆత్మవిశ్వాసం హృదయమంతా నింపుకొని, పైవాడిని మనసున తలచు కొని, తాను పుట్టి పెరిగిన యింటిని, పేగుబంధాలను తెంచేసుకొని తాను కోరుకున్న తనకు నచ్చిన భర్త చేయి పట్టుకొని విశాల జనారణ్యంలోకి తన జీవన ప్రస్థానం కొనసాగించడానికి వెళ్లి, తన తండ్రి చెప్పిన "అమ్మీ, నీవు చాలా కష్టాలు పడ్డా, సుఖశాంతులతో వర్ధిల్లుతావని" చివరగా చెప్పినఆ మాటలను మనసారా తలచుకుంటూ కొత్త జీవితం లోకి వెళ్లిపోయింది అజీమా బేగం. ❑

---

# తపస్సు

**ఓట్ర ప్రకాశ్‌రావు**

**పౌరాణిక** సినిమా అయినా హాల్‌లో ప్రేక్షకులు చాలా మంది వచ్చారు. కొత్త టెక్నాలజీని వుపయోగించి తీసిన పౌరాణిక సినిమా కావడం వల్ల ఈ తరానికి చెందిన కుటుంబ సభ్యులు ఆ సినిమాకు వచ్చారు.

ఆ సినిమాలోని యుద్ధం దృశ్యంలో బాణాలు సంధించి వదిలినప్పుడు రెండు బాణాలు నిప్పులు విరజిమ్ముతూ రావడం చూసి "మమ్మీ, మామూలు బాణం అంతగా నిప్పును వదులుతూ వెళ్తుందా?" అంటూ చింటూ అడిగాడు.

"పౌరాణిక కథను అలాగే తీశారు. చిన్నప్పుడు మా బామ్మ చెప్పిన కథ కూడా ఇదే" అంది తల్లి.

సరయిన సమాధానం రాకపోవడంతో అసంతృప్తిగా చింటూ సినిమా చూడసాగాడు.

మరొక దృశ్యం చింటూను మరింత ఆశ్చర్యం కలిగించింది.

సినిమాలో ఒక ముని చేస్తున్న తపస్సు భగ్నం చేయడానికి ప్రయత్నిస్తున్నారు. తపస్సు చేస్తున్న వ్యక్తికి భంగం కలిగించాలని ఉరుములు, మెరుపులు వాటి శబ్దాలతో పాటు భారీ వర్షం కురిసేలా చేశారు. ఆ సాధువు అలాగే ఏకాగ్రతతో తపస్సు చేయడం చింటూకు నవ్వు తెప్పించింది. సినిమా థియేటర్‌లో అత్యాధునికమైన సౌండ్ సిస్టం వల్ల ఉరుములు, పిడుగుల శబ్దాలతో దద్దరిల్లుతోంది.

తల్లిని అడుగుదామని "అమ్మా" అని పిలుస్తూ చేతిని తట్టాడు. సినిమాలో లీనమైపోయి సమాధానం చెప్పలేదు. ఒకవేళ అడిగినా ఎటువంటి సమాధానం చెబుతుందో కొంతవరకు ఊహించాడు. అమ్మ సమాధానం ఇవ్వకపోవడమే మంచిదయింది.

అడిగివుంటే "బామ్మ చెప్పిన పౌరాణిక కథ" అంటూ ప్రశ్న అడిగినందుకు విసుక్కుంటోంది అని అనుకొని తండ్రి వైపు అలాగే చూడసాగాడు.

"ఇంతకుముందు నన్ను పిలిచావు, ఎందుకు చింటూ" అని అడుగుతున్న తల్లి వైపు తిరిగి–

"అమ్మా! సాధువు తపస్సును భంగం చేయాలనుకున్నా చలించకుండా తపస్సు చేయడం లాంటి పాత్రలు ఈ కాలంలోనూ వున్నారు" అంటున్న చింటూ వైపు వింతగా చూస్తూ..

"ఎలా చెబుతున్నావురా?" అంది.

"వర్క్ ఎట్ హోమ్..

అంటూ సినిమా చూడకుండా శబ్దాలను పట్టించుకోకుండా సీరియస్‌గా ఆఫీస్ పనిలో మునిగిపోయిన నాన్నను చూస్తుంటే ఆ సినిమాలోని సాధువులా కనపడుతున్నారు" అన్నాడు చింటూ.

"ఆఫీసు పని ఉందని ఇంట్లో చెబితే నేనే గొడవ చేసి సినిమాకు తీసుకొని వచ్చాను.

ఆ కాలంలో కఠినమైన తపస్సు చేస్తేనే దేవుడు ప్రత్యక్షమయ్యేవాడు.

ఈ కాలంలో మీ నాన్న లాంటి ఐటీ ఉద్యోగులు అలా కఠినమైన తపస్సు చేస్తేనే లక్ష్మీదేవి కరుణిస్తుంది" అంటూ మరలా సినిమా చూడసాగింది.

తపస్సు చేస్తున్న సాధువులా లాప్‌టాప్ ముందు పని చేస్తున్న తండ్రినే గమనించసాగాడు చింటూ. ❑

---

## రచనలకు ఆహ్వానం

రచయితల నుండి కథలు, కవితలు, సమకాలీన వ్యాసాలు స్వాగతిస్తున్నాం. రచనలతో పాటు మీ పేరు, చిరునామా, హామీపత్రం తప్పనిసరిగా జతచేయాలి. ఎంపిక కాని రచనలు తిప్పి పంపగోరేవారు తగిన పోస్టేజీ జత చేసిన కవరు పంపించాలి. ఇతర పత్రికల పరిశీలనలో ఉన్న రచనలు పంపించకండి. రచనలు పంపించాల్సిన చిరునామా: **ఎడిటర్, ఆదివారం వార్త, నం.396, లోయర్ ట్యాంక్ బండ్, డిబిఆర్ మిల్స్ పక్కన, హైదరాబాద్-80.**

sunmagvaartha@gmail.com

# పాటే ఆయుధంగా 'సుద్దాల హన్మంతు'

వీర తెలంగాణ నేల మీద మొలకెత్తిన పాటలో, అణచివేత అన్యాయాలు, హింస, అమానుషత్వం, బానిస బతుకుల రక్తనాళాల్లోని నాటి జీవన వేదన కారణంగా తిరుగుబాటు జ్వలించిన విప్లవోత్తేజం వుంది.

నిజాం నిరంకుశ పాలన, భూస్వాముల దౌర్జన్యాలు, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాలు, కమ్యూనిస్టు విప్లవ సాయుధ తిరుగుబాటు నాటి చరిత్రలో పాట, తూటాలను ఆయుధంగా పోరాడిన ప్రజాకవి సుద్దాల హనుమంతు సాహితీ యానం, నాటి ప్రజా పోరాట ఉద్యమాలకు, చైతన్యపు కాగడా వెలిగించింది. ఆర్యసమాజ్, ఆంధ్ర మహాసభ, కమ్యూనిస్టు ఉద్యమ స్ఫూర్తితో దేశభక్తునిగా, ప్రజల మనిషిగా, గేయ రచయితగా సుద్దాల హన్మంతు ప్రజా కళారూపాల ద్వారా జన సామాన్యాన్ని కదిలించారు.



1910లో జన్మించిన హన్మంతు, జీవితంలో సమరయోధునిగా ఉమ్మడి నల్గొండ జిల్లాలోని పాలడుగు గ్రామంలో తాత, తండ్రి వారసత్వ కళారంగ స్ఫూర్తితో, వైద్యునిగా పల్లెలకు సేవలందిస్తూ గళం, కలంతో రజాకార్ల దురాగతాలపై అలుపెరుగని పోరాటం సాగించారు. ఆశువుగా పాటలతో జనాన్ని చైతన్యపరుస్తూ, దిన దిన గండంగా, అడవులు, గుట్టలు దాటు కొంటూ గెరిల్లా యుద్ధ తంత్రంతో, తెలంగాణ సాహితీ సీమలో సామాజిక, రాజకీయ, సాంస్కృతిక జీవనానికి బాటలు వేసారు. 'పల్లెటూరి పిల్లగాడ' పాట జాతి చైతన్య ప్రతీకగా తెలంగాణ జానపద సాహిత్యంలో సంచలనం సృష్టించింది. 1946లో రాసిన 'ఈ నిజాం ఎవడురా?' గేయంలో–

**"ఈ భూమి నీదిరా/ఈ నిజాం ఎవడురా!**
**ఈ జులుం ఈ జబర్‌దస్తి/**
**ఎదిరించగ లేవరా"**

అంటూ రణోత్తేజం సృష్టించారు.

సుద్దాల హన్మంతు పాటల వందలాదిగా, కాలగర్భంలో కలిసిపోయాయి. పేదరికం, అవిద్య, మత ఘర్షణలు, మహిళలపై దాడులు, పల్లెలలో రైతులు, కార్మికుల అణచివేతల జీవన వ్యథ తన పాటలలో ప్రతిధ్వనింపచేసారు. జనాన్ని జాగృతపరిచే యాస, భాష పదాల కూర్పుతో జనరంజకంగా ఆ పాటలు ఆకట్టుకునేవి.




"నేను ఛందస్సు నేర్చుకోలేదు. వ్యాకరణం, నిఘంటువుల జోలికి పోలేదు. నా కవిత్వం, దౌర్జన్యం పట్ల, వేదన పట్ల వేగాత్మక ఆవేశంతో వెలుగు చూసింది" అన్నారు.

సుద్దాల హన్మంతు ఆదర్శప్రాయంగా జీవించారు. ఎలాంటి ప్రలోభాలకు లొంగలేదు. పార్టీ అప్పగించిన కళారంగ నాయక కార్యకర్త బాధ్యతను, తెలంగాణ సంస్కృతీ సజీవ జానపద రూపాలైన బుర్రకథ, బుడబుక్కల, గొల్లసుద్దులు, పిట్టలదొర వంటి ప్రక్రియలతో పోరాటాలకు పల్లెల జనాన్ని ఉత్తేజపరిచారు. "ప్రజా ప్రభుత్వం సాధిస్తాం" "దెబ్బకు దెబ్బ", "రణభేరి మ్రోగుతుంది తెలుగోడ", 1948లో రాసిన–

**"లేరా లేరా వేగమే**
**నరకర ఎగబడి, పొడవర తెగబడి**
**ఏటుకు ఇద్దరు పోటుకు ముగ్గురు పొర్లగ**
**ధరపై వీర తెలంగాణము పేరు నిల్పగ"**

వంటి సమరోత్సాహపు గేయాలు ఎన్నో ఉన్నాయి. స్వాతంత్ర్యానంతర పరిస్థితులపై కూడా కవిగా స్పందించిన గేయాలున్నాయి.

1982 అక్టోబరు 10న మన మధ్య నుండి హన్మంతు కనుమరుగయ్యారు. తండ్రి వారసత్వాన్ని అందుకొని, పీడిత జన బాధామయ గాథల్ని, సృజనాత్మక సినీ గేయ సాహిత్యం సృష్టిస్తున్న కుమారుడు 'అశోకతేజ' ఆణిముత్యాలైన గేయాలను రచిస్తూ సాహితీ ప్రస్థానం కొనసాగిస్తున్నారు. తండ్రిని గురించి పాట రాసి, ఆయన సజీవంగా ఉండగానే వినిపించారు.

**"పల్లెటూరి పిల్లగాని/పాలగుండె నిమిరి**
**కూలివాని కళ్లలోని/**
**జాలిగాథ చదివి**
**ప్రజాస్వామ్యమిదాయని/ప్రశ్నించిన**
**ప్రజాకవీ!**
**ప్రభాత గీతాలు పాడ, ప్రభవించిన**
**ప్రభారవీ!**
**నిన్నంతం చేయలేదు నాన్నా ఏ**
**మృత్యువు!**
**నింగివోలె ప్రకృతివోలె చిరంజీవి నువ్వు"**

అని రాసారు.

సుద్దాల హన్మంతు శత జయంతి వేడుకల సందర్భంలో 'పల్లెటూరి పిల్లగాడా' ఆయన రచన పేరిట ప్రజాకవి సుద్దాల హనుమంతు పాటలు–కళారూపాలు అనే గ్రంథాన్ని సుద్దాల ఫౌండేషన్ ప్రచురించి, ఆ మహాకవి, గాయకునికి నివాళి ఘటించడం ఎంతైనా సముచితం. ఆయన అనారోగ్యంతో వున్న రోజులలో ఆయన చెప్తుంటే రికార్డు చేసిన కథనం, ఆధారంగా ఆత్మకథ వెలువడింది.

నాటి తెలంగాణ ఎదుర్కొన్న విషాద పోరాట చరిత్ర ఘట్టాలను వివరించే, సజీవ ఉదాహరణగా సుద్దాల హన్మంతు స్వయంగా తన ఆత్మకథ వివరించారు. సమాజంలో ఎక్కడైనా ఎప్పుడైనా పీడన, అణచివేత, హింస ఉన్నంత కాలం సుద్దాల, కాళోజీ, దాశరథి, గద్దర్, గోరటి, అందెశ్రీ వంటి ఎందరో ప్రజాగాయకులు, కళాకారులు ప్రజల నాలుకలపై సజీవంగా తారాడుతూనే వుంటారు.

**- జయసూర్య**

# అవసరానికి మించింది భారమే!

**అనగనగా ఓ బిచ్చగాడు ఉన్నాడు. అతను ఎప్పుడూ చేతిలో ఓ సత్తుపళ్లెం పట్టుకుంటాడు. ఇంటింటికి వెళ్లి అడుక్కుంటాడు.**

కొందరు వేసేవారు. ఎవరైనా అన్నం పెడితే అది తీసుకుపోయి ఓ చెట్టుకింద తిని పడుకుండిపోతాడు.

అతని జీవితం అలాగే సాగిపోతోంది.

ఒరోజు అతను ఎప్పట్లాగే సత్తుపళ్లెం పట్టుకుని రోడ్డు పక్కగా పోతున్నాడు. అప్పుడు ఉన్నట్టుండి పళ్లెంలోంచి ఓ శబ్దం వినిపించింది. అందులోకి చూడగా ఎవరో ఒక అయిదు రూపాయల నాణెం వేశారు. దానిని తీసుకుని ఓ గుడ్డలో ఉంచి ముడి వేశాడు. ఆ తర్వాత అతను కొందరి ఇళ్లకు వెళ్లి అడుక్కున్నాడు. ఆ పూటకు తగినంత ఆహారం దొరికింది. అది తీసుకుని ఎప్పుడూ వెళ్లే చెట్టు కిందకు వెళ్లి కూర్చున్నాడు.

అతనిలా అడుక్కునే వారందరూ ఆ చెట్టుకిందకే చేరుకోవడం కద్దు. అయితే అప్పటికే వారందరూ పడుకుని ఉన్నారు. అతనికి నిద్ర రాలేదు.

మూట కట్టిన అయిదు రూపాయల నాణాన్ని బయటకు తీసి చూసాడు. దానిని అటూ ఇటూ తిప్పాడు.

కాసేపైంది.

పక్కనే పడుకున్నతనిని నిద్ర లేపాడు. .

"తన పళ్లెంలో ఎవరో అయిదు రూపాయలు వేశార" జరిగిన విషయం చెప్పాడు.

అతను చెప్పింది విన్న ఆ బిచ్చగాడు "ఇదిగో చూడు, మనకు కావలసిందల్లా ఆహారమూ, బట్టలూ. ఆ రెండూ మనం శ్రమ పడకుండానే మనకు లభిస్తున్నాయి. కనుక ఈ డబ్బూ గట్రా మనకు అనవసరం. పైగా అవి మనకు భారం కూడా. నీ దగ్గరున్న అయిదు రూపాయల నాణెం మనలాంటి వారికి అక్కర్లేనిది. కనుక ఇది ఎవరికి ఎక్కువగా ఉపయోగపడుతుందో వారికి ఇచ్చేసేయి" అన్నాడు.

ఆ తర్వాత అతను "నన్నిక లేపకు" అంటూ పడుకుండిపోయాడు.

కానీ ఇతనికి నిద్ర రావడం లేదు. ఎంతసేపూ అయిదు రూపాయల చుట్టూ అతని ఆలోచనలు తిరుగుతున్నాయి.

ఆ అయిదు రూపాయలను ఎవరికి ఇవ్వాలి? అని ఆలోచిస్తూ కూర్చున్నాడు. ఆరోజు రాత్రి గడిచి తెల్లవారింది. కానీ అతనికి అప్పుడు నిద్ర వస్తోంది. సరిగ్గా ఆ సమయంలోనే ఏవో అరుపులు వినవచ్చాయి. ఎవరో గొడవ పడుతున్నట్టు ఉన్నాయా అరుపులు. అందరూ లేచారు.

ఇతను మాత్రం నిద్ర పోయాడు. పెద్ద పెద్ద అరుపులు వినిపించడంతో అతను నిద్ర లేచాడు. అతని చేతిలో అయిదు రూపాయల నాణెం అలాగే ఉంది. ఇంతలో ఆ మార్గంలో రాజుగారు వస్తున్నారు. అందుకే అరుపులు తప్ప గొడవ కాదు అని తెలుసుకున్నారు. రాజుగారు రథంలో వస్తున్నారు. వెనుక, ముందర వరుస క్రమంలో సైనికులు ఉన్నారు.

"ఎప్పుడూ లేనంతగా ఈరోజు ఇంత మంది సైనికులతో రాజు వస్తున్నాడేమిటి చెప్మా?" అనుకున్నారు బిచ్చగాళ్లు. "ఏమై ఉంటుంది?" అని ఆలోచించారు. ఇంతలో రథం దగ్గర పడింది.

ఈ బిచ్చగాడు ఏం చేశాడో తెలుసా? తన దగ్గరున్న అయిదు రూపాయల నాణాన్ని రాజుగారి దిశలో విసిరాడు. అది సరిగ్గా రాజుగారి రథంలో పడింది. రాజు తల వంచి చూసాడు.

అది అయిదు రూపాయల నాణెం.

ఈ నాణెం విసిరిన ఆ బిచ్చగాడిని పట్టుకురండి" అని ఆదేశించడంతో సైనికులు వెళ్లి అతనిని పట్టుకుని రాజు దగ్గరకు తీసుకువచ్చారు.

విచారణ మొదలైంది.

"ఎందుకిలా అయిదు రూపాయల నాణెం విసిరావు?" అని ఆ బిచ్చగాడిని నిలదీశారు.

అప్పుడు బిచ్చగాడు ఏం జరిగిందో వివరంగా చెప్తూ "రాజా, ఒక్కమాట. ఈ మాట అడుగుతున్నానని కోప్పడకండి. కానీ అడగాలనిపించింది" అన్నాడు.

రాజు అడగమన్నాడు.

"రాజా, మీరు ఇంతమందితో కలిసి బయలుదేరారు. అంటే అది ఎవరి మీదో విజయం కోసం, సంపద కోసం, పేరు కోసం కదా" అని మళ్లీ–

"కనుక మీకే డబ్బు అవసరం ఎక్కువ. నాకు దీనితో పని లేదు. అందుకే అలా అయిదు రూపాయల నాణెం విసిరాను. నిజానికి మీ దగ్గరకు వచ్చి ఈ నాణెం ఇద్దామనుకున్నాను. కానీ మీ మనుషులు నన్ను మీ దగ్గరకు రానివ్వరు. అందుకే అలా మీకేసి విసిరాను" అని, మళ్లీ–

"నాకు పెద్దగా ఆలోచించడం తెలీదు. నేను చేసింది తప్పయితే నన్ను శిక్షించండి. మీరు ఏ శిక్ష విధించినా శిరసావహిస్తాను" అన్నాడు వినయంగా బిచ్చగాడు.

అతని మాటలన్నీ విన్న రాజుకు బిచ్చగాడంటే ఏమిటో అర్థమైంది. తానేమిటో తెలిసింది.

ఇలా ఈ కథ సాగింది. అవసరానికి మించినదేదైనా భారమే. అది భరించడం కష్టంతో కూడుకున్నది.

బరువేదో తెలుసుకుని దాన్ని కిందకు దించేయడం ఎప్పటికీ మంచిది. అప్పుడే జీవితం హాయిగా ఉంటుంది.

**- యామిజాల జగదీశ్**



# ఆస్ట్రేలియాలో ప్రకృతి సోయగాలు

షేక్ అబ్దుల్ హాకీం జాని



**దక్షిణార్ధ** గోళంలో నెలకొని వున్న ఆస్ట్రేలియా చుట్టూ అనేక దీవులు, సుందర ప్రదేశాలు ఉన్నాయి. యూరోపియన్ల రాకతో ఆస్ట్రేలియాలో ఆధునిక జీవనశైలి మొదలైంది. ఇప్పటికీ ఆ దేశంలో పాటించే చాలా పద్ధతులు యూరప్ దేశాల వారివే పోలి ఉంటాయి. పూర్తిగా సముద్రంలో ఉన్న అతి పెద్ద దేశం ఏదంటే ఆస్ట్రేలియానే. ప్రపంచంలో ఆరో పెద్ద దేశం ఇదే. ఇది పురాతన ఖండం మాత్రమే కాదు, ఎత్తుపల్లాలు తక్కువగా ఉండే ఖండం కూడా. చెప్పాలంటే ఎండిపోయిన ఖండం. మనుషులు జీవించేందుకు అనుకూలమైనది కాదు. భూమిలో సారం కూడా తక్కువే. అయినప్పటికీ ఇప్పుడు అక్కడ 2.60 కోట్ల మందికి పైగా జీవిస్తున్నారు. అభివృద్ధి పథంలో పయనిస్తూ ఇప్పుడు ఆస్ట్రేలియా ప్రపంచ పర్యాటకుల్ని ఆకర్షిస్తోంది. ఇక్కడ నెలకొని ఉన్న కొన్ని పర్యాటక ప్రదేశాల గురించి తెలుసుకుందాం..

## నీలి పర్వతాలు

ఈ ప్రాంతం ఒక అతి పెద్ద ఇసుకరాతి మైదానం. నీలి పర్వతాలు తూర్పు ఆస్ట్రేలియాను వేరు చేస్తూ నెలకొన్న అతిపెద్ద పర్వతశ్రేణి ప్రాంతం. ఇదొకప్పుడు అతిపెద్ద ఇసుకరాతి మైదానం. కొన్ని వేల సంవత్సరాల కాలంలో ఈ మెత్తటి రాయి తీరం నుండి ఇవతలకు జరుగుతూ వచ్చి అద్భుతమైన శిఖరాలతో కూడిన ఎత్తుపల్లాలు, లోతైన గుంటలు, లోయలు, జలపాతాలు, గుహలు, అరణ్యాలు ఏర్పడ్డాయి. ఈ పర్వత ప్రాంతంలో ఎన్నో జాతీయ వనాలు, జాతీయ అడవులు వున్నాయి. ఇవి యునెస్కోవారి నుండి ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తింపు పొందాయి. నీలిరంగు పర్వత శిఖరాలకు మధ్యన వున్న కటుంబా అనే పేరుగల పట్టణం యాత్రికులకు విడిదిగా ఉపయోగపడుతుంది. నీలి పర్వత శిఖరాలపై నుండి తిలకిస్తే ప్రకృతి రమణీయత వర్ణనాతీతంగా ఉంటుంది. ఈ ప్రాంతంలో బ్రిడాల్ జలపాతం, పల్పిట్ రాతిగుట్ట ఇత్యాది ప్రదేశాలు సందర్శించదగినవి. నీలి పర్వతాలకు పడమర వైపున జెనోయిమ్ గుహలు నెలకొని ఉన్నాయి. ఒకప్పుడు వీటిని సందర్శించడానికి సరైన మార్గం ఉండేది కాదు. ఇప్పుడు ఈ ప్రాంతంలోని లోయలు, అటవీ ప్రాంతం, పర్వత శిఖరాలు, జలపాతాలు మొదలైనవి తిలకించడానికి అనేక మార్గాలు ఏర్పడటంతో పర్యాటకులు సునాయాసంగా చేరుకుని ప్రకృతి అందాలను ఆస్వాదిస్తున్నారు. కేబుల్ కార్ల ద్వారా నీలి పర్వత అందాలను విహంగ వీక్షణం చేయవచ్చు. ఎత్తయిన పర్వత శిఖరం అంచున నిలబడి ఈ ప్రాంతాన్ని తిలకిస్తుంటే ఆ అనుభూతి వివరించడానికి మాటలు చాలవంటే అతిశయోక్తి కాదు. మనం పర్వత శిఖరంపై నిలబడి చూస్తుంటే కొన్ని సందర్భాలలో మేఘాలు చేతికి అందేంత చేరువగా వెళ్లడం చూడవచ్చు.



## బుకనీర్ అర్చిపెలాగో

పశ్చిమ ఆస్ట్రేలియాకు వాయవ్య దిశలో సముద్రం మధ్యలో నెలకొని ఉన్న వెయ్యి చిన్న చిన్న దీవుల సమూహమే బుకనీర్ అర్చిపెలాగో. ఈ దీవులు మంచుయుగంలో సముద్రం ఉప్పొంగి ప్రధాన భూభాగాన్ని విడగొట్టడం వల్ల ఏర్పడ్డాయి. నీలి సముద్రం కనువిందు చేస్తుంది. ఇక్కడి పచ్చదనం చిత్రలేఖనం చేసినట్లు కనిపిస్తుంది. తీర ప్రాంతంలో ఎగసిపడే అలల సోయగం వర్ణనాతీతం. ఇక్కడి ఒక జలపాతం రెండు దీవుల మధ్య అతి సన్నని దారిలో శరవేగంతో పరుగులు తీస్తూ సముద్రంలో కలిసే దృశ్యం చూసి తీరాల్సిందే. బుకనీర్ అర్చిపెలాగో దీవుల చుట్టూ నెలకొని ఉన్న సముద్ర

జలాలు చాలా స్వచ్ఛంగా ఉంటాయి. ఈ జలాల్లో మొసళ్లు, షార్క్‌చేపలు, పలురకాల సముద్ర జీవులు నివసిస్తున్నాయి. ఇక్కడి అటవీ ప్రాంతంలో వందల రకాల పక్షులు, సరీసృపాలను చూడవచ్చు.



## గ్లాస్ హౌస్ పర్వతాలు

కెప్టెన్ కుక్ ఈ ప్రాంతాన్ని గాజు పలకంపై సూర్యుడిలా ఉన్నట్లు భావించి గ్లాస్ హౌస్ పర్వతాలు అని పిలిచాడు. ఆస్ట్రేలియాలోని క్వీన్స్‌లాండ్ సముద్ర తీరానికి కొన్ని మైళ్ల దూరంలో భూతలం దాని చుట్టూ మైదానంతో కన్పిస్తాయి. ఈ పర్వతాల చుట్టూ కొన్ని కి.మీ. మేర అరణ్యాలు ఏర్పడ్డాయి. కొన్ని మిలియన్ల సంవత్సరాల క్రితం భూకంపాల నుండి లావా పొంగి చల్లారి ఇసుకరాతి మైదానం ఏర్పడింది. కొంత కాలానికి ఎత్తుగా ఉన్న రాళ్ల కొన్ని వందల మీటర్ల దిగువకు జారి ఇలాంటి నిర్మాణం ఏర్పడింది. గ్లాస్ హౌస్‌లోని కొన్ని పర్వతాలను సునాయాసంగా అధిరోహించవచ్చు. మరికొన్ని పర్వతాలను శారీరకంగా బలం కలిగిన యువత మాత్రమే ఎక్కగలరు. ఈ ప్రాంతంలో కంగారు జంతువులను చూడవచ్చు. గ్లాస్ హౌస్ పర్వత శిఖరంపై నుండి చూస్తే మైదాన ప్రాంతాలలో ఉన్న చెట్లు, చేమలు, దారులు అద్భుతంగా కనిపిస్తాయి.



ఉలురు, కట ట్జుటా నేషనల్ పార్క్
ఆస్ట్రేలియాలో సందర్శించదగిన ప్రదేశాలలో ఉలురు, కట ట్జుటా నేషనల్ పార్క్ చెప్పుకోదగింది. ఆస్ట్రేలియాలోని ప్రధాన పర్యాటక ఆకర్షణలలో ఇది ఒకటి.
ఒంటెపైగానీ, హెలికాప్టర్‌పైగానీ ఈ ప్రదేశాన్ని తిలకించవచ్చు.
ఉలురు, కట ట్జుటా అనేవి రెండు ప్రదేశాలు. వీటి మధ్య దూరం పాతిక మైళ్లు ఉంటుంది. ఈ ఉద్యానవనం 1326 చదరపు కి.మీ. విస్తీర్ణంలో నెలకొని ఉంది. సహజ ప్రకృతి సౌందర్యాలకు నిలయమైన ఈ ప్రదేశాలను యునెస్కోవారు ప్రపంచ వారసత్వ ప్రదేశాల జాబితాలో చేర్చారు. ఉలురు ఆస్ట్రేలియాలోని రెడ్ సెంటర్ నడిబొడ్డున ఉంది. ప్రకాశవంతమైన ఎరుపు రంగు ఏకశిలా ఉలురు-కట ట్జుటా నేషనల్ పార్క్‌కి కేంద్రంగా ఉంది. విభిన్న మొక్కలు, జంతుజాలానికి ఇది ఆవాసంగా భాసిల్లుతోంది. ఉలురులో కొండను పోలిన భారీ ఏకశిల ప్రత్యేక ఆకర్షణ. ఇది 3.6 కి.మీ. పొడవు, 2.4 కి.మీ. వెడల్పు, 9.4 కి.మీ. చుట్టుకొలతతో గంభీరంగా కనిపిస్తుంది. క్రీ.శ.1872లో ఎర్నెస్ట్ గైల్స్ అనే అన్వేషకుడు దీన్ని కనుగొన్నాడు. ఈ రాక్ ఎడారి మైదానం నుండి 1,142 అడుగుల ఎత్తును కలిగి ఉంది. సముద్ర మట్టానికి 2,831 అడుగుల ఎత్తులో ఉంటుంది. ఆంగ్లంలోకి అనువదించినప్పుడు ఉలురు అంటే 'నీడ ఉన్న ప్రదేశం' అని అర్థం. కటా ట్జుటా అని పిలుచుకునే ఓల్గాస్‌లో ఎరుపు గోపురం ఆకారపు రాళ్లను కూడా చూడవచ్చు. సూర్యుడు అస్తమిస్తున్నప్పుడు కటా ట్జుటాతో పాటు ఉలురులో సైతం రంగులు మారుతున్న కాంతిలో ప్రకృతి రూపాంతరం చెందడాన్ని చూడవచ్చు.



## కంగారు దీవి

దక్షిణ ఆస్ట్రేలియా సముద్ర తీరానికి దగ్గరలో ఉంది ఈ దీవి. అరణ్యాలలో కన్పించే పలురకాల జంతువులు ఇక్కడ కనిపిస్తాయి. ఈ దీవిలోని అత్యధిక భాగం ప్రకృతి సంపదను ప్రభుత్వం కాపాడుతూ రక్షణ కల్పిస్తుంది. కంగారూలు, ఆస్ట్రేలియన్ సముద్రపు సింహాలకేకాక మరెన్నో ఆటవిక మృగాలకు ఈ ప్రాంతం నిలయం. ఈ దీవి మైదాన ప్రాంతం సమతలంగా ఉండక మిట్టపల్లాలుగా ఉండి దీని మధ్య భాగం మరింత పొడుచుకువచ్చినట్లు ఎత్తుగా ఉండి పడవ తిరగబడి డినట్లు ఉంటుంది.
ఈ దీవిలోని నాలుగు ప్రదేశాలను చక్కటి ఉద్యానవనాలుగా తీర్చిదిద్దారు. వీటిలో సున్నపురాతి గుహల స్థావరం కెల్లిహిల్, సముద్రపు సింహాల స్థావరంగా ప్రసిద్ధి చెందిన సీల్‌బే, గొప్ప రాళ్లగుట్టగా పేరొందిన ఫ్లిండర్స్ చేజ్ ఇత్యాదివి తిలకించదగినవి. ఈ ప్రాంతంలో సముద్ర తీరం అదనపు ఆకర్షణగా చెప్పవచ్చు. ఈ దీవిలోని అతి పెద్ద బండరాళ్లకు కంగారు పొట్టలో సంచిలా కనిపించే అతి పెద్ద రంధ్రాలు ప్రకృతిసిద్ధంగా ఏర్పడ్డాయి. పర్యాటకులు ఈ రంధ్రాల గుండా రాయిలోపలికి వెళ్లి కంగారుపొట్టలో కూర్చున్న అనుభూతిని పొందుతారు.

## క్రెడిల్ పర్వతం-సెయింట్ క్లేర్ జాతీయవనం

ప్రకృతి సంపదల్లో ఒకటిగా ప్రసిద్ధి చెందింది క్లేర్ జాతీయవనం. క్రెడిల్ పర్వతం-సెయింట్ క్లేర్ జాతీయవనం ఆస్ట్రేలియాలోని టాస్మానియా సెంట్రల్ హైలాండ్ హోబర్ట్‌కు వాయవ్యంగా 165 కి.మీ. దూరంలో నెలకొని ఉన్న ఈ ప్రదేశం 1545 మీటర్ల ఎత్తయిన పర్వతం మీద ఉంది. ఈ ప్రాంతం ప్రపంచ వారసత్వ ప్రదేశంగా యునెస్కోవారి గుర్తింపు పొందింది. సెయింట్ క్లేర్ జాతీయ వనానికి ఉత్తర భాగంలో క్రెడిల్ పర్వతం ఉంది. దీనికి దూరంగా దక్షిణ భాగంలో సెయింట్ లేక్ పేరుతో అతిపెద్ద మంచినీటి సరస్సు ఉంది. ఈ ప్రాంతంలో సుందర పర్వతాలు, గలగల పారే నీటి ప్రవాహాలు, జలజలా జాలువారే జలపాతాలు, మంచుతో నిండిన కొలనులు, అరణ్యాలు, మైదానాలు, నీటి ప్రవాహాలు, చూడచక్కని పర్వతాలు ఒకదాన్ని మించి మరొకటి అన్న చందాన ప్రకృతి రమణీయత కనువిందు చేస్తుంది. ఈ ప్రాంతంలోనే ప్రాంక్లిన్ అనే నది కూడా ప్రవహిస్తుంది. ఇది అతి ప్రాచీన అరణ్యం. వేసవిలో ఇది చూడచక్కని ప్రదేశం.





## కాకడు నేషనల్ పార్క్

ఆస్ట్రేలియా ఉత్తర భూభాగం పై భాగంలో ఉన్న మరో ప్రపంచ వారసత్వ ప్రదేశం 'కాకడు నేషనల్ పార్క్'. భూమిపై నెలకొని ఉన్న గొప్ప అరణ్య ప్రాంతాలలో ఇది ఒకటి. ఆస్ట్రేలియాలో అతిపెద్ద జాతీయ ఉద్యానవనంగా భాసిల్లుతున్న కాకడు 19,840 చదరపు కిలోమీటర్ల కంటే ఎక్కువ విస్తీర్ణంలో ఉన్నందున ప్రపంచంలో రెండవ అతిపెద్ద జాతీయ ఉద్యాన వనంగా ప్రసిద్ధి చెందింది. ఈ పార్కులో మడ అడవులు, రుతుపవనాల వర్షారణాలు, కనుమలు, నదులు, చిత్తడి నేలలు, పురాతన రాతి చిత్రాలు, జలపాతాలు, అలాగే అనేక రకాల వన్యప్రాణులు ఉన్నాయి. అనేక సరీసృపాలు, క్షీరదాలు, చేపలతో పాటు 300 కంటే ఎక్కువ విభిన్న జాతుల పక్షులు ఈ ఉద్యానవనాన్ని తమ నివాసంగా మార్చుకున్నాయి. వర్షాకాలంలో ఈ ప్రాంతంలో భారీ వర్షపాతం నమోదౌతుంది. భారీ వరదలు సంభవించినప్పుడే ఇక్కడి రహదారులు మూసివేస్తారు. ఆ సమయంలో పర్యాటకుల ప్రవేశం నిషిద్ధం.

## బేక్డ్ మసాలా గోబీ



**కావలసినవి**

క్యాలీఫ్లవర్ ముక్కలు-రెండు కప్పులు, పెరుగు-రెండు టేబుల్‌స్పూన్లు, కారం-అర టీ స్పూన్, జీలకర్రపొడి-ఒక టీ స్పూన్, తందూరి మసాలా-ఒక టీ స్పూన్, అల్లం, వెల్లుల్లి పేస్టు-ఒక స్పూన్, కొత్తిమీర-కొద్దిగా, ఉల్లికాడలు-రెండు, నూనె-సరిపడా, ఉప్పు-తగినంత.

**తయారీ విధానం:** బౌల్‌లో పెరుగు తీసుకుని అందులో కారం, జీలకర్ర పొడి, తందరి మసాలా, అల్లంవెల్లుల్లి పేస్టు, బెల్లం, జొన్నపిండి వేయాలి. నిమ్మరసం, ఉప్పు కలపాలి. ఇందులో క్యాలీఫ్లవర్ ముక్కలు వేసి బాగా కలిపి అరగంట పాటు మారినేట్ చేసుకోవాలి. క్యాలీఫ్లవర్ ముక్కలపై కొద్దిగా నూనె వేసి ఒవెన్‌లో ఇరవై నిమిషాల పాటు బేక్ చేసుకోవాలి. ఒవెన్ లేకపోతే పాన్‌పై వేయించాలి. కొత్తిమీర, తరిగిన ఉల్లికాడలతో గార్నిష్ చేసుకుంటే టేస్టీ బేక్డ్ మసాలా గోబీ రెడీ.

## కార్టూన్లకు ఆహ్వానం

కార్టూనిస్టుల నుండి ఆరోగ్యకరమైన హాస్యాన్ని అందించే కార్టూన్లను స్వాగతిస్తున్నాం.
అంశం ఏదైనా సరే! మంచి హాస్యాన్ని అందించాలి.
కార్టూన్లతో పాటు మీ పేరు, చిరునామా, హామీపత్రం తప్పనిసరిగా జతచేయాలి.
ఎంపిక కాని కార్టూన్ల తిప్పి పంపగోరేవారు తగిన పోస్టేజీ జత చేసిన కవరు పంపించాలి.
కార్టూన్లు పంపించాల్సిన చిరునామా:
**ఎడిటర్, ఆదివారం వార్త**, నం.396,
లోయర్ ట్యాంక్ బండ్, డిబిఆర్ మిల్స్ పక్కన,
హైదరాబాద్-500 080.
sunmagvaartha@gmail.com



# వారఫలం

పాలకుర్తి సంతోష శర్మ, స్మార్త పండితులు
సుబ్బరాజు టవర్స్, 11-10-30/308
విజయపురి కాలనీ, కొత్తపేట
హైదరాబాద్. ఫోన్: 9494608133

## మేషం



శుభ కార్యాలకు హాజరవుతారు. సంతానాభివృద్ధి గరించి చేసే చర్చలు ఫలిస్తాయి. ధార్మిక కార్యకమాలు నిర్వహిస్తారు. వ్యాపారులకు రుణాలు లభిస్తాయి. కోర్టు వ్యవహారాలు వాయిదా పడతాయి. ఉద్యోగులకు శుభ యోగం. స్వల్ప ధన లాభ సూచనలున్నాయి. జాయింటు వ్యవహారాలు పరిష్కారమవుతాయి. ముఖ్యమైన పనులు పూర్తవుతాయి.

## వృషభం



వృత్తి రంగాల్లో వున్నవారికి బాగుంటుంది. సామాన్య ధన లాభ సూచనలున్నాయి. మీ శక్తి సామర్థ్యాలకు తగిన గుర్తింపు లభిస్తుంది. ధార్మిక చింతన అలవడుతుంది. ప్రయత్నాలు ఫలిస్తాయి. ఉద్యోగులకు పదోన్నతి లభించే సూచనలు అధికంగా ఉన్నాయి. అన్ని వ్యవహారాల్లో విజయం సాధిస్తారు. వ్యాపారులకు సమస్యలు పరిష్కారమవుతాయి.

## మిథునం



విద్యార్థులు అధిక శ్రమ చేయాల్సి ఉంటుంది. ఉద్యోగులకు శుభ యోగం. అకారణంగా మనోవేదనకు లోనవుతారు. వ్యతిరేకతలు ఎదురైనా ప్రారంభించిన పనులు పూర్తి చేస్తారు. వృథా సంచారం చేస్తారు. ఆలోచనల్లో స్థిరత్వం లోపిస్తుంది. సామాన్య ధన లాభ సూచనలున్నాయి. వృత్తి రంగాల్లో వున్నవారికి రుణాలు చేతికందివస్తాయి.

## కర్కాటకం



రుణాలు చేస్తారు. గృహ సౌఖ్యం. ఆకస్మికంగా కోర్టు వ్యవహారాలకు హాజరు కావాల్సి వస్తుంది. సంతానాభివృద్ధి గురించి చేసే చర్చలు ఫలిస్తాయి. ఆరోగ్య సమస్యలు ఉంటాయి. చోర భయం పొంచి వుంది కనుక విలువైన వస్తువులు, పత్రాల పట్ల అప్రమత్తంగా ఉండండి. ఉద్యోగులకు స్థాన చలన సూచనలున్నాయి. బంధు, మిత్రులను కలుసుకుంటారు.

## సింహం



వృతి రంగాల్లో పని చేసేవారికి ఆర్థిక ఫలితాలు బాగుంటాయి. ఆరోగ్య సమస్యలు తీరి ప్రశాంతత పొందుతారు. కుటుంబ గౌరవం పెంపొందుతుంది. సామాన్య ధన లాభం. ధార్మిక చింతన అలవడుతుంది. అదనపు ఆదాయ మార్గాలకై అన్వేషిస్తారు. దూర ప్రాంతాల్లో వున్న ఆత్మీయుల నుండి ముఖ్య సమాచారం అందుకుంటారు.

## కన్య



భాగస్వామ్య వ్యాపారస్తులు సామరస్యంతో విడిపోతారు. సామాన్య ధన లాభాలు పొందుతారు. ఖర్చులు అధికంగా ఉంటాయి. మానసిక అలసటకు లోనవుతారు. విలువైన వస్తువులు కొనుగోలు చేస్తారు. సంతానాభివృద్ధి సంతృప్తినిస్తుంది. బంధు, మిత్రులను కలుసుకుంటారు. వృథా సంచారం చేస్తారు. ఆరోగ్య సమస్యలు తీరి ప్రశాంతత పొందుతారు.

## తుల



వాహన యోగం. నిరుద్యోగులకు ఎదురు చూస్తున్న ఉద్యోగం లభిస్తుంది. వారమంతా ఉత్సాహంగా గడుస్తుంది. స్వల్ప అనారోగ్య సమస్యలు ఎదురవుతాయి. అకారణంగా మానసిక వేదనకు లోనవుతారు. సాహిత్య సభలు, సమావేశాల్లో పాల్గొంటారు. ఉద్యోగులకు ఉత్సాహంగా గడుస్తుంది. ప్రతికూలతలు ఎదురైనా ప్రారంభించిన పనులు సకాలంలో పూర్తి చేస్తారు. శారీరక, మానసిక అలసటకు లోనవుతారు.

## వృశ్చికం



సామాజిక సంఘర్షణకు లోనవుతారు. రుణాలు తీరుస్తారు. వృత్తి వ్యవహారాలు లాభదాయకంగా ఉంటాయి. ఉద్యోగులకు బాగుంటుంది. కుటుంబ సమస్యలు తీరి ప్రశాంతత లభిస్తుంది. ప్రయత్నాలు ఫలిస్తాయి. భాగస్వామ్య వ్యాపారులకు ఆశించిన ఫలితాలుంటాయి. శుభ కార్యాలకు అనుకూలమైన ఫలితాలుంటాయి. క్రయ-విక్రయాలు లాభదాయకంగా ఉంటాయి. ఆరోగ్య సలహాలు, సూచనలు పాటించడం మంచిది.

## ధనుస్సు



తీర్థ యాత్రలు చేస్తారు. ఆర్థికాభివృద్ధి సంతృప్తికరంగా ఉంటుంది. వ్యాపారులకు సమస్యలు తీరుతాయి. కోర్టు వ్యవహారాలు సానుకూలంగా ఉంటాయి. ఆరోగ్య, ఆహార సలహాలు-సూచనలు తూచా తప్పకుండా పాటించండి. బంధు, మిత్రులతో స్వల్ప సమస్యలు ఎదురయ్యే సూచనలు ఉన్నాయి. అదనపు ఆదాయానికై అన్వేషిస్తారు. ముఖ్యమైన నిర్ణయాలు తీసుకునేటప్పుడు పెద్దలను సంప్రదించండి.

## మకరం



ఆటంకాలు తీరి ప్రభుత్వ సంబంధమైన పనులు పూర్తవుతాయి. ధార్మిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. మీ శక్తి, సామర్థ్యాలకు గుర్తింపు లభిస్తుంది. స్త్రీల వల్ల సమస్యలు ఎదురయ్యే సూచనలున్నాయి. వాహన ప్రాప్తి. విద్యార్థులకు శుభ యోగం. పాప కార్య చింతన మంచిది కాదని స్వీయానుభవంతో తెలుసుకుంటారు. కుటుంబ గౌరవం పెంపొందుతుంది. ఆరోగ్య సమస్యలను నిర్లక్ష్యం చేయకండి. చర్చలు వాయిదా.

## కుంభం



వ్యాపారులకు సామాన్యంగా ఉంటుంది. చిన్న చిన్న ఆరోగ్య సమస్యలుంటాయి. ఆర్థికంగా బాగుంటుంది. రుణాలు లభిస్తాయి. చిరు వ్యాపారులకు శ్రమ పెరుగుతుంది. వృత్తి వ్యాపారాలు చేసేవారికి బాగుంటుంది. శుభ కార్యాలకు హాజరవుతారు. భాగస్వామ్య వ్యాపారులకు సమస్యలు పరిష్కారమవుతాయి. స్వల్ప ధన లాభ సూచనలున్నాయి.

## మీనం



క్రయ-విక్రయాలు లాభదాయకంగా ఉంటాయి. ఉద్యోగులకు పనివత్తిడి ఉంటుంది. సంయమనం కోల్పోకుండా నిదానంగా పనులు చేసుకోవడం ఉత్తమం. ఉద్యోగులకు ఉన్నతాధికారుల ఒత్తిడి ఉంటుంది. కుటుంబ సమస్యలు ఉంటాయి. పాప కార్య చింతన మంచిది కాదని తెలుసుకుంటారు. కళాకారులకు కీర్తి ప్రతిష్ఠలు లభిస్తాయి. ఖర్చులు అధికంగా ఉంటాయి కనుక ఆచి తూచి వ్యవహరించడం మంచిది.




# జోక్స్

## విచారణ సులభం

సుబ్బారావు: అగ్నిప్రమాదాలకు ఎలక్ట్రిక్ షార్ట్ సర్క్యూట్ కారణమని చెబుతారు. ఎందుకు?

అప్పారావ్: చాలా సింపుల్, దాంతో విచారణ పూర్తవుతుంది.

## మా పిల్లలున్నారుగా!

నీరజ: ఈ కాలంలోనూ పదవ తరగతి ఫెయిల్ అవుతున్నవారు ఉన్నారంటావా గిరిజా?

గిరిజ: ఎందుకు లేరు.. సాక్షాత్తు నా కూతురు, కొడుకు ఉంటేను" అని ఠక్కున నాలిక కరుచుకుంది.



## ఆసక్తి కలిగేలా..

సాధారణంగా మహిళలందరికీ చీరలు, నగలు అంటే ఎక్కువ మోజు ఉన్నట్లు తన భార్యకు లేకపోవడంతో ఆమెను ఒక హిప్నాటిస్ట్ దగ్గరికి వెళ్లి అందరి స్త్రీలలా తన భార్యను మార్చమని చెప్పాడు.

హిప్నాటిస్ట్ సుబ్బారావ్ భార్యను అలాగే చేశాడు.

కానీ తన భార్యలో ఏమాత్రం మార్పు రాకపోయేసరికి సుబ్బారావ్ హిప్నాటిస్ట్‌ను నిలదీశాడు.

"మీరు చెప్పినట్టే చేసాను కదా!" అన్నాడు హిప్నాటిస్ట్.

"మరి చీరలన్నా, నగలన్నా నా భార్య ఆసక్తి చూపించడం లేదెందుకు?" అన్నాడు సుబ్బారావు.

"మీరు.. మీ భార్యను మిగతా మహిళల మాదిరిగా చేయమన్నారు. మీ లాంటి భర్తలు తమ భార్యలను తీసుకొచ్చి చీరలు, నగలపై మోజు లేకుండా చేయమంటారు. నాకేం తెలుసు? మీ భార్యకు అవంటే మోజు లేదని. మీరు ఆ మోజు కలిగించమని నాకు చెప్పలేదు.

సుబ్బారావుకు నోట మాట రాలేదు.

**- కె.లవారి,** కరీంనగర్

## అందులో నేనుండాలి!

మోహన్: స్నేహితుడు రాకేశ్‌తో "దేశ సంపద కేవలం కొద్ది మంది దగ్గరే కేంద్రీకృతమైంది" అంటే నీకేమనిపిస్తుంది? అడిగాడు.

రాకేశ్: "ఆ కొద్ది మందిలో నేను ఒక్కనిగా ఉంటే చాలు అనిపిస్తోంది" అన్నాడు ఛలోక్తిగా.

**- కె.వెంకటరమణరావు,** కరీంనగర్

## ముగ్గులోకి దింపాలి..

కూతురు: మమ్మీ, అర్జంటుగా నాకు ముగ్గులెయ్యడం నేర్పించమ్మా!

తల్లి: అంత అవసరం ఏమొంచ్చిందిప్పుడు?

కూతురు: నా బాయ్‌ఫ్రెండ్‌ని ముగ్గులోకి దింపాలి, అందుకోసం.

తల్లి: ఆ..

## వంట లేటయింది

బాస్: మూర్తీ, నీకెన్నిసార్లు చెప్పినా ఆఫీసుకు లేటుగానే వస్తున్నావు, ఎందుకని?

మూర్తి: వంట చేయటం లేటయిందండీ!

బాస్: వంట మీ ఆవిడ చేస్తుంది కదా.

మూర్తి: లేదండీ! ఉదయంపూట వంట నేనే చేస్తాను అంటూ నాలిక కరుచుకున్నాడు.

## చిన్న పర్సనాలిటీ

కూతురుదోమ: రమా గారి ఇంట్లోకి వెళ్లి తృప్తిగా రక్తం తాగేవా? వాళ్ల ఈగలు కూడా దూరకుండా గ్రిల్ ఏర్పాటు చేసుకున్నారు కదా! ఎలా సాధ్యమైంది?

తల్లిదోమ: నాది ఈగకన్నా చిన్న పర్సనాలిటీ కదా. అందుకే సులభంగా దూరి వెళ్లాను.

## చొక్కా ఒంటిమీదే ఉందిగా!

రాజు: రవీ! మీ ఇంట్లోంచి అరుపులు వినిపిస్తున్నాయి, ఏమైంది?

రవి: మా అమ్మ నాన్నగారి చొక్కా ఉతుకుతోంది.

రాజు: చొక్కా ఉతికితే అరుపులు ఎందుకు వినిపిస్తున్నాయి?

రవి: చొక్కా మా నాన్నగారి ఒంటి మీద ఉండగానే ఉతుకుతోంది.

రాజు: అదన్నమాట అరుపుల వెనుక వున్న సంగతి.

## అప్పులు చేయాలి!

టీచర్: మనల్ని అందరూ పది కాలాల పాటు మరిచిపోకుండా ఉండాలంటే మనం ఏం చేయాలి?

విద్యార్థి: అప్పులు.

టీచర్: ఆ..!

## వాట్సప్ పంపించండి

గృహిణి: నీకు వేళా పాళా లేదా? ఎప్పుడంటే అప్పుడే వచ్చేస్తావు?

యాచకుడు: మీ వంట అయిన వెంటనే నా మొబైల్‌కు వాట్సప్ పంపించమ్మా, ఠక్కున వస్తాను.

**- వైదా ఈశ్వరరావు,** విశాఖపట్నం

## సరదా రచనలకు ఆహ్వానం

జోక్స్, ప్యారడీ పాటలు, సరదా అనుభవాలు, పంచ్ డైలాగులు వగైరాలు పంపితే పరిశీలించి, బాగుంటే ప్రచురిస్తాం. దయచేసి కాపీ రచనలు పంపకండి.

మీ రచనలు పంపించవలసిన చిరునామా: నవ్వుల్.. రువ్వుల్, ఎడిటర్, ఆదివారం వార్త, నం.396, లోయర్ ట్యాంక్‌బండ్, హైదరాబాద్-500 080. **sunmagvaartha@gmail.com**

# రొయ్యల పాలెం-గవ్వల పాలెం

వంజర కుప్పం ఓ జాలర్ల గ్రామం. ఇది తమిళనాడు రాష్ట్రానికి, ఆంధ్ర రాష్ట్రానికి సరిహద్దు గ్రామం. కుప్పంలో ఎక్కువ మంది తమిళులు, కొద్ది మంది తెలుగు జాలర్లు. అందరూ కలిసి మెలసి జీవిస్తున్నారు. పొద్దువాలిన తరువాత సముద్రం నుంచి పడవలు తీరానికి వస్తున్నాయి. అన్ని పడవలు తీరంలోకి రాగానే ఆడవాళ్ల కేకలు, పిల్లల అరుపులతో అక్కడ పెద్ద కలకలం రేగింది. ఎవరికి సంబంధించిన పడవల మీదికి వాళ్లు ఎగబడ్డారు. పడవల నిండుగా ఉన్న చేపల్ని బుట్టల్లోకి ఎత్తసాగారు.

ఆదివారం ఆటవిడుపు రోజున వంజర కుప్పం గ్రామానికి దూరంగా తీరానికి పది గజాల దూరంలో ఇసుకలో కొమ్మలు నేలకానుకుని గుబురుగా పెరిగిన కానుగ చెట్ల మధ్య ఉన్నారు నీలమ్మ, రామచంద్రయ్య. చిన్నప్పుడు స్నేహితులు వాళ్లు. ఇప్పుడు ప్రేమికులు. రామచంద్రయ్య తెలుగువాడు. నీలమ్మ తమిళ యువతి.

రామచంద్రయ్యతో సరదాగా ఉంటుంది. కొంటెమాటలతో కవ్విస్తుంది. తల కింద చేతులు పెట్టుకుని వెల్లకిలా పడుకుని ఉన్నాడు రామచంద్రయ్య. ఒంటి మీద చొక్కా లేదు. అడ్డపంచె మాత్రమే కట్టుకుని ఉన్నాడు. అతని గుండెల మీద తల వాల్చి పడుకుని ఉంది నీలమ్మ. చాలాసేపు ప్రేమ కబుర్లు చెప్పుకున్నారు.

"సేపల రాజా, మనం పెళ్లెప్పుడు చేసుకుందాం" గోముగా అడిగింది నీలమ్మ. "నువ్వెప్పుడు అంటే అప్పుడే సేపలరాణీ" అన్నాడు, రామచంద్రయ్య.

వీళ్లు ఇలా తమ ప్రేమ కలాపాలతో ఉండగా గుబురు ఆకుల సందుల్లోంచి దేశప్ప చూసాడు.

చెట్ల మధ్య వ్యవహారం నీలమ్మ తండ్రి ఏడుమళై చెవిన వేసాడు దేశప్ప. దేశప్ప పోయించిన మద్యం తలకెక్కి ఉగ్రుడైపోయాడు ఏడుమళై. నేరుగా వెళ్లి ఆ గ్రామ పెదకాపు పెరియస్వామి దగ్గరకెళ్లి ఫిర్యాదు చేసాడు. పెదకాపు ఆ రాత్రి దండోరా వేయించాడు. మరుసటి రోజు ఎవరూ వేటకు వెళ్లకూడదని, ఉదయం అందరూ పంచాయితీకి హాజరు కావాలని. గ్రామ పెదకాపు కట్టు తప్పిన వాళ్లను శిక్షిస్తాడు. అన్యాయం జరిగితే న్యాయం చెబుతాడు.

ఆ మరుసటి రోజు వంజరకుప్పం ఊరిమధ్య వేపచెట్టు కింద ఉన్న అరుగు మీద పద్మాసనం వేసుకుని కూర్చున్నాడు పెదకాపు. అతనికి అటూ ఇటూ ఇద్దరిద్దరు గ్రామపెద్దలు కూర్చుని ఉన్నారు. వాళ్లు కుమరేశం, దినేశ్, చినస్వామి, దేవప్పన్.

అక్కడికి తన కుమార్తె నీలమ్మతో వచ్చాడు ఏడుమలై, అతని భార్య మల్లిగ. అదే విధంగా తన కొడుకు రామచంద్రయ్యతో వచ్చాడు ముత్యాలయ్య, భార్య కుప్పమ్మతో. రెండు కుటుంబాలకు సంబంధించిన కుటుంబ సభ్యులు కూడా వాళ్ల వాళ్లకు కొద్ది దూరంలో నిలబడి ఉన్నారు. ఊరిజనం, ఆడా, మగా, పిల్లా, జెల్లా అంతా వచ్చారు.

పెద్దకాపు పెరియస్వామి అందరినీ ఒకసారి చూసి "చెప్పరా దేశప్పా, నువ్వేం చూసావో" అన్నాడు గంభీరంగా.

దేశప్ప తను చూసిందంతా చిలవలు పలువలు జేసి చెప్పాడు. చివరకు "వాళ్లు పెళ్లి చేసుకోవాలనుకుంటే అదెట్ట కుదురుద్ది" అన్నాడు దేశప్ప.

అక్కడి అందరికీ రామచంద్రయ్య, నీలమ్మల చనువు తెలుసు. "ఏమే నీలా, నీకు ఆ రామచంద్రయ్యను పెళ్లి చేసుకోవడం ఇష్టమేనా?" అడిగాడు పెరియస్వామి. "ఇష్టమేనయ్యా" అని చెప్పింది నీలమ్మ.

"దానికేం తెలుసయ్యా, చిన్న పిల్ల. అది తలూపితే మాత్రం నేను పెళ్లి జేస్తానా?" రంకెలు వేసాడు ఏడుమళై.

"నేను ఎవుర్నడిగితే వాళ్లే జవాబు సెప్పాల" హుంకరించాడు పెరియస్వామి.

మౌనం వహించాడు ఏడుమళై.

తరువాత రామచంద్రయ్య వైపు తిరిగిన పెరియస్వామి "ఏరా, నీకు నీలను పెళ్లి చేసుకోవడం ఇష్టమేనా?" అన్నాడు.

"ఇష్టమే" అన్నాడు రామచంద్రయ్య.

తరువాత ఏడుమళైనడిగాడు పెదకాపు. కుదర్నే కుదరదన్నాడు ఏడుమళై. ఏడుమళై భార్యా, పిల్లలు మాత్రం తమకిష్టమేనని అన్నారు. నీలమ్మను బంగారంగా చేసుకుంటామని సంతోషంగా చెప్పారు రామచంద్రయ్య కుటుంబ సభ్యులు.

తన పక్కన కూర్చున్న వృద్ధుల వైపు అటూ ఇటూ తల తిప్పి చూసిన పెదకాపు పెరియస్వామి "ఇకనేం, ఒక్క ఏడుమళై తప్ప రెండు కుటుంబాల్లో అందరూ ఒప్పుకున్నట్లే. మీరేమంటారు?" అన్నాడు.

"అనేదేముంది? పెళ్లి సేసెయ్య డమే" అన్నారు ఆ వృద్ధులు ఏక కంఠంతో.

దేశప్ప ఏడుమళై చెవిలో ఏదో ఊదాడు. "ఇదెక్కడన్నా ఉందా, అరవోళ్లు, తెలుగోళ్లు పెళ్లి చేసుకోవడం" పెద్ద మనుషుల్ని తిడుతూ వీరంగం చేసాడు ఏడుమళై.

ఈ లోగా నీలమ్మను తన కోడలుగా చేసుకోవాలనుకుంటున్న దేశప్ప అరవ వాళ్లందరినీ ఒక తాటి మీదకు తెచ్చాడు. తెలుగువాళ్లతో అరవవాళ్లు సంబంధాలు చేసుకోకూడదని అంతా గందరగోళంగా తయారయింది. పెరియస్వామి తన పక్కనున్న పెద్ద మనుషుల వైపు చూసాడు. వాళ్లు కూడా అరవ వాళ్లే. అందరూ ఒప్పుకుంటే సరే. పట్టుదలకొస్తే వాళ్లు సెప్పేదీ నిజమే కదా.. అంటూ అరవ వాళ్లతో, తెలుగు వాళ్లకు పెళ్లి సంబంధం కుదరదని తేల్చారు. చివరకు అదే తీర్పు చెప్పాడు పెరియస్వామి.

ఆ అర్ధరాత్రి ఒకరి చేయి ఒకరు పట్టుకుని కొత్త జీవితం ప్రారంభించడానికి వేరే గ్రామానికి పరుగులు తీసారు రామచంద్రయ్య, నీలమ్మలు. అందరికీ విషయం తెలిసి వాళ్లిద్దర్నీ పట్టుకుని వంజరకుప్పం తీసుకొచ్చారు. వాదోపవాదాలు లేకుండా పెదకాపు రామచంద్రయ్య కుటుంబాన్ని గ్రామం నుంచి బహిష్కరించాడు. బహిష్కరించబడ్డ రొయ్యల రామచంద్రయ్య కుటుంబం అక్కడనుంచి తెలుగు గ్రామాలకు వెళ్లడానికి నిశ్చయించుకుని తట్టి, బుట్టా సర్దుతుంటే ఇతి దాయాదులైన రొయ్యల ఇంటిపేరు గలవాళ్లు వీళ్లకు మామల వరుసైన గవ్వల కుటుంబాల వాళ్లు వంజరకుప్పం వదిలి తమ కుటుంబాలతో ఉత్తరం వైపు బయలుదేరారు.

రాత్రంతా ప్రయాణించిన పడవలు తెల్లవారే సమయానికి ఆంధ్రా తీరానికి వచ్చేసాయి. ఒకచోట వాళ్లకు తీరం పక్కనే ఇసుక దిబ్బ మీద అంతెత్తున చిక్కగా పెరిగిన టెంకాయ చెట్లతో పెద్ద తోపు కనిపించింది. ఎక్కడో సముద్రం దీవుల్లోని టెంకాయ చెట్ల కాయలు తుఫాను ధాటికి రాలి, అలలతో ఈ తీరానికి కొట్టుకొచ్చి ఇక్కడ పెరిగాయి. గవ్వలోళ్లందరినీ ఇక్కడే ఉండమన్నాడు ముత్యాలయ్య. రొయ్యల కుటుంబాల వాళ్లు తమ పడవలను తీరానికి నడిపారు. అలా రొయ్యల పాలెం, గవ్వల పాలెం ఏర్పడ్డాయి.

– పోట్లూరు సుబ్రహ్మణ్యం


అభ్యర్థుల ఖర్చు, ఓట్ల కొనుగోలు, ఎండల్లో ప్రచారం కంటే...
ఎన్నికలయ్యాక గెలిచిన అభ్యర్థుల్ని కొనడం చాలా చీప్...!!
ప్రచారం
పార్టీ ప్రధాన కార్యాలయం
Zakir...


మీ ఫోన్ కనిపిస్తే చాలా...?
పక్క వాళ్ళది కూడా కనిపించాలా..?!
X
abc
123
Zakir...


ఒక్క కుక్క తప్పు చేసిందని.. కుక్కలన్నిటికీ ఆపరేషన్లు చేసేస్తున్నారే...? ఇంత మంది మనుషులు తప్పులు చేస్తుంటే ఒక్కరికైనా ఆపరేషన్ చేసారా...?!!
Zakir...

ఈ వారం కా'ర్టూన్స్'



ఎక్కడైనా కోటకు రక్షణగా సైనికులు ఉంటారుగానీ ఈ కోటను చూస్తే కోట చుట్టూ వున్న ఇళ్లే దానికి రక్షణా ఉన్నాయనిపిస్తుంది. దక్షిణ ఇటలీలోని కాలాబ్రియా ప్రాంతంలోని ఒక పట్టణం రోకా ఇంపీరియల్. రోకా ఇంపీరియల్‌లో పర్వతాల నడుమ ఎత్తయిన కొండ మీద ఓ పురాతన కట్టడం ఉంది. ఆ కోటను ఆనుకుని కింది వరకూ వరుసలు.. వరుసలుగా కొన్ని వందల ఇళ్లు నిర్మితమై ఉన్నాయి. వీటి వల్లనే దీనికి గుర్తింపు లభించింది. ఇక చెప్పేదేముంది! ప్రకృతి ప్రేమికులు, ట్రెక్కింగ్ ప్రియులకు ఈ పట్టణం పర్యాటక ప్రాంతంగా మారిపోయింది.







